₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 10

మే 16-31, 2019

## ప్రవక్తలు, మతాచార్యుల వల్లే జనరాజకీయం నీరు గారుతున్నదా?




## రాజ్యాంగ ప్రజాస్వామ్యం సామాజిక న్యాయం

## కేసీఆర్! 'పౌర సేవల' చట్టాన్ని తెండి

## స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికల కోసం పోరాడతాం



## 'జనరేషన్ జెడ్'కీ లోక్‌సత్తాను కనెక్ట్ చేయాలి




# ప్రజాస్వామ్యానికే ప్రమాద ఘంటికలు... నల్లడబ్బు ఎన్నికలు, ఫిరాయింపులు

ప్రజలు డబ్బు తీసుకునేలా రాజకీయ నాయకులు అలవాటు చేశారని, ఈవేళ ఎన్నికల్లో గెలవటం మాట అలా ఉంచి...గెలిచే అవకాశముంది అనిపించుకోవాలంటే కూడా కోట్లు ఖర్చు పెట్టాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఎన్నికల్లో పోటీకి డబ్బు ఎంట్రీ పాయింట్ అయిపోయిందన్నారు.

నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా), తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టీజేఏ) ఆధ్వర్యంలో 'ఎలక్షన్ ఫండింగ్, ఎలక్షన్ స్పెండింగ్‌లో పారదర్శకత' అంశంపై హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది.

డబ్బు రాజకీయాలు, తాత్కాలిక తాయిలాల పందేరాన్ని తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు దేశవ్యాప్తం చేశాయని జేపీ అన్నారు. తమిళనాడులో ఒక్కో అసెంబ్లీ స్థానం ఎన్నికల ఖర్చు రూ.100 కోట్లు దాటిపోయిందన్నారు. ఎంపీ ఎన్నికలకన్నా ఎమ్మెల్యే ఎన్నికకు ఖర్చు ఎక్కువగా ఉంటోందని, నూటికి 99 శాతం మంది అక్రమంగా డబ్బు ఖర్చు పెట్టి ఎన్నికల్లో గెలుస్తున్నారని అన్నారు. ఆ తర్వాత ప్రజాధనం, వనరుల దోపిడీతో, ఫిరాయింపులతో అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఎమ్మెల్యేల మీద ఆధారపడిన ముఖ్యమంత్రి... నిందితుడే కాకుండా బాధితుడు కూడా అవుతున్నారన్నారు. విదేశాల్లో పార్టీలకు విరాళాలిస్తే వివరాల్ని తెలియజేస్తారని, మనదేశంలో విరాళాలిచ్చినవారి పేర్లను రహస్యంగా ఉంచుతున్నారన్నారు. ఎలాగోలా ఎన్నికల్లో గెలవటం, గెలిచాక ఇంకో పార్టీలోకి ఫిరాయించటం ఇలాగే కొనసాగితే... ఇక ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటం కూడా కష్టమవుతుందన్నారు. ఈ సంక్షోభానికి ఆచరణీయ పరిష్కారాలున్నాయని, ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, దామాషా ఎన్నికల పద్ధతి వంటి మార్పుల్ని ఎన్నికల వ్యవస్థలో సాధించుకోవాలని వివరించారు. ఈ ఎన్నికల వ్యవస్థ అత్యుత్తమం కాదని, మన దేశ పరిస్థితులకు ఈ ఎన్నికల సంస్కరణలు ఎక్కువగా ప్రయోజనకరంగా ఉంటాయని అన్నారు. దేశంలో జరిగిన మొదటి ఎన్నికల్లో నెహ్రూ తనకు ఓటు వేయమని అడగలేదని, ఆ తర్వాత పోటీ ఉండటంతో అడిగారని జాతీయ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య చెప్పారు. ఇప్పుడు నాయకులు డబ్బులు ఎరవేసి ఓట్లు అడుక్కుంటున్నారన్నారు. ప్రస్తుతం ప్రజాసమస్యలపై పోరాడే పార్టీ ఏదీ లేదన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి మద్యం దుకాణాలు, బార్‌లు బంద్ చేయాలని, మీడియా సంస్థలు రాజకీయ పార్టీలకు అమ్ముడుపోకూడదని అన్నారు. వ్యయపరిమితులు దాటిన వారిపై చర్యలు తీసుకుంటే దేశంలో ఒక్క ఎంపీ, ఎమ్మెల్యే కూడా మిగలరని కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్ అన్నారు. కార్యక్రమంలో ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు ఉప్పల లక్ష్మణ్, సుప్రీంకోర్టు న్యాయవాది డి.వి. రావు, ఎన్‌జేఐ కార్యదర్శి సిల్వేరి శ్రీశైలం, టీజేఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సూర్యప్రకాష్ రెడ్డి, వి. రాజేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

మే 16-31, 2019 సంపుటి - 10 సంచిక - 10

## లోపలి పేజీల్లో...

రాజ్యాంగ ప్రజాస్వామ్యం - సామాజిక న్యాయం....5

తెలుగువారి ఆత్మీయనేత .............................11

'సామాజిక' భ్రష్టత్వం ఈ దేశ దౌర్భాగ్యం............ 13

దొంగవడ్రా ! ........................................... 18

ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం ! .......................... 22

రాజకీయ ప్రశ్నోపనిషత్తు ! ............................ 25

నిర్లక్ష్య పాలనకు యువత మూల్యం చెల్లిస్తున్నారు..28

స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరగాలి,.... 29

(మీడియాలో) 'కీ' కామెంట్లు ! ...................... 30

'జనరేషన్ జెడ్' కీ లోక్‌సత్తాను కనెక్ట్ చేయాలి..... 32

## కార్టూన్ కార్నర్



మళ్లీ మిమ్మల్నే ప్రధాని అభ్యర్థిగా ప్రకటిస్తే బెటర్ సార్!

### సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె. వి. కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ప్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి


FOLLOW ME ON
twitter
Friends, Interacting with youngsters always gives me immense pleasure. You can tweet your suggestions , ideas , queries to :
@JP_LOKSATTA
I will try to respond to as many as possible
DR.JAYAPRAKASH NARAYAN, FOUNDER, LOKSATTA




# రాజ్యాంగ ప్రజాస్వామ్యం - సామాజిక న్యాయం

- డా॥ జయప్రకాష్ నారాయణ్

ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించటానికి; సమానస్థాయిని, అవకాశాల్ని కల్పించటానికి; వ్యక్తి గౌరవాన్ని పరిరక్షిస్తూ సౌభ్రాతృత్వాన్ని పెంపొందించటానికి భారత రాజ్యాంగం తన పీఠికలోనే నిర్దిష్ట హామీల్ని ఇచ్చింది. ఈ హామీలలో ప్రతి ఒక్కటీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సామాజిక న్యాయంతో ముడిపడి ఉన్నదే.

భారతదేశంలోని వైవిధ్యం నమ్మశక్యం కానంత విస్తృతం, సంక్లిష్టమైనదని మనందరికీ తెలుసు. అన్ని విశ్వాసాల్నీ, సంస్కృతులను అక్కునచేర్చుకుంటూ, అన్ని స్రవంతులనూ అరమరికలు లేకుండా కలుపుకుంటూ సమ్మిళిత ధోరణితో వ్యవహరించే శక్తి భారతీయ సమాజం సొంతం. మన వైవిధ్యంలోని పలు అంశాలు ఈ శక్తికి అద్దం పడుతుంటాయి. కానీ కుల వ్యవస్థ అనే ఒక్క అంశం.. ఈ సమ్మిళిత, ఐక్యతా ధోరణులకు పూర్తి విరుద్ధమైనది! 'వర్ణ', 'జతి' వ్యవస్థ మనుషుల్ని పుట్టుకను బట్టి విడదీసి మన సమాజాన్ని నిలువునా చీల్చింది. పుట్టుకలో, పుట్టుక ద్వారానూ మనుషుల మధ్య అసమానతల్ని ఏర్పరిచారు; వ్యక్తులు తమకు ఎంత సామర్థ్యమున్నా, ఎంత కష్టపడి పనిచేసినా ఈ పుట్టుకతో అసమానతల్ని మార్చలేరనే భావన శతాబ్దాలుగా మన సమాజానికి శాపంగా కొనసాగుతోంది. పుట్టుకతో అసమానతను కుల వ్యవస్థ సంస్థాగతం చేసింది. అటువంటి అమానుషమైన, క్రూరమైన అణచివేత మామూలే.. అనుకునే స్థాయికి మన సమాజాన్ని దిగజార్చింది. కులాన్ని పట్టించుకోనివారు, అణచివేతను అసహ్యించుకునేవారు కూడా తరచుగా తమకు తెలియకుండానే కుల ప్రభావానికి లోనవుతుంటారు. దీన్నే మైరన్ వీనర్ 'సైకాలజీ ఆఫ్ క్యాస్ట్' (కుల స్వభావ ఆలోచనా ధోరణి)గా అభివర్ణించారు. మనలో చాలామంది ఇంట్లో పని మనుషులు, డ్రైవర్ల పట్ల వాత్సల్యంతో, దయతో వ్యవహరిస్తారు. కానీ వారి పిల్లలకు సరైన విద్యావకాశాలు అందుబాటులో లేకపోవటాన్ని మాత్రం చాలా సందర్భాల్లో పట్టించుకోరు. ఇదంతా 'మామూలే' అనుకుంటారు. కుల రహిత సమాజం కోసం కంకణం కట్టుకున్నామని చెప్పే మన మాటలకు .. పుట్టుక, తల్లిదండ్రుల చదువు, ఆదాయం, హోదాతో సంబంధం లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను అందించటంలో ఒక సమాజంగా మన వైఫల్యానికి మధ్య అంతరం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

డా॥ అంబేద్కర్ ఇంకొన్ని నెలల్లో మరణించటానికి ముందు, 1956, మార్చి 18న ఆగ్రాలో ఒక చరిత్రాత్మక ప్రసంగాన్నిచ్చారు. "మీకు రాజకీయ హక్కులను సాధించటానికి నేను గత 30 ఏళ్లుగా పోరాడుతున్నాను. పార్లమెంటులో, రాష్ట్రాల అసెంబ్లీల్లో మీకు రిజర్వుడు స్థానాలను సాధించగలిగాను. మీ పిల్లల చదువుకు తగిన ఏర్పాటును చేయగలిగాను. ఇవాళ మనం పురోగమించగలం. విద్య, ఆర్థిక, సామాజిక అసమానతల్ని నిర్మూలించేలా ఈ

పోరాటాన్ని సమైక్యంగా కొనసాగించాల్సిన బాధ్యత ఇక మీ భుజాలపై ఉంది" అని ఆయన చెప్పారు.

ప్రభుత్వోద్యోగుల గురించి అంబేద్కర్ ఇలా అన్నారు: "చదువులో మన సమాజం లో కొంత పురోగతి ఉంది. చదువుకోవడం ద్వారా కొంతమంది ఉన్నత పదవులకు చేరుకున్నారు. కానీ ఈ చదువుకున్న వాళ్లు నన్ను మోసం చేశారు. ఉన్నత విద్యను పొందిన తర్వాత వాళ్లు సమాజా నికి సేవ చేస్తారని నేను వారి నుంచి ఆశించాను. కానీ ఈవేళ నేను చూస్తున్నది కొంతమంది చిన్న, పెద్ద గుమాస్తాల గుంపుని! తమ బొజ్జల్ని నింపుకోవటంలో తలమునకలైన గుంపు ఇది."

విద్యార్థులు, యువతకు ఆయన పిలుపునిస్తూ, "విద్యార్థులకు నా విజ్ఞప్తి ఇదే. చదువును పొందిన తర్వాత ఏదోక గుమాస్తా పని చేయటానికి బదులు, మీ గ్రామానికి లేదా ప్రాంత ప్రజలకు సేవ చేయండి. దీనివల్ల.. అజ్ఞానం కారణంగా దోపిడీకి, అన్యాయానికి గురవటం ఆగిపోతుంది. సమాజ విముక్తిలోనే మీ విముక్తి ఉంది" అని చెప్పారు.

రాజ్యాంగం అమల్లోకి వచ్చిన ఆరేళ్ల తర్వాత బాబాసాహెబ్ ఎంతో లోతైన, నిర్మొహమాటమైన వ్యాఖ్యలు చేశారు. ఈ పరిశీలనకు చాలా ప్రాధాన్యత ఉంది. చట్టబద్ధంగా మినహాయింపు కల్పించిన హక్కులు ముఖ్యమైనవే, కానీ విద్య, ఆర్థిక, సామాజిక అసమానతని తొలగించటానికి నిరంతర పోరాటం అవసరం.. అని ఆయన స్పష్టంగా గుర్తించారు. తాను పోరాడి రాజ్యాంగంలో పొందుపరిచేలా చేసిన హక్కుల నుంచి లాభం పొందిన కొద్దిమంది, సొంత ఆదాయాలను పోగేసుకోవటంలో తలమునకలై ఉన్నారని అంబేద్కర్ వేలెత్తి చూపారు. జడలు వరచుకొని ఉన్న అసమానతల్ని, సమాజంలోని అవకాశాలకు నోచుకోని కోట్లాదిమందిని వీరు విస్మరించారంటూ




ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వోద్యోగం కోసం ఎదురుచూసే యువత సమాజాన్ని విముక్తం చేయలేరని మందలించారు. అజ్ఞానం వల్ల దోపిడీకి, అన్యాయానికి గురికావటాన్ని నిర్మూలించి తీరాలని ఉద్ఘాటించారు.

అప్పటి నుంచి, ఆరు దశాబ్దాలకు పైగా గడిచిపోయాయి. అంబేద్కర్ శంకించినదే భవిష్యవాణి అని రుజువైంది. మనం సమానత్వాన్ని, అవకాశాల్ని పెంపొందించ టానికి; న్యాయాన్ని పొందటానికి చట్టబద్ధ వ్యవస్థల్ని ఏర్పాటు చేసుకున్నాం. కానీ వాస్తవంలో మాత్రం.. నిజమైన సమానత్వం, అవకాశాలు, న్యాయం మన ప్రజల్లోని అత్యధిక సంఖ్యాకులకు అందటం లేదు. మన రాజ్య వ్యవస్థలు, వాటి పనితీరులోని లోపాల్ని గుర్తించి ఒక క్రమపద్ధతి ప్రకారం సరి చేయటం మాత్రమే ఈవేళ ప్రయోజనకారి పని అవుతుంది.

ఒక వ్యక్తి లేదా కుటుంబం సొంతంగా చేసుకోలేని ఉమ్మడి అవసరాలను తీర్చటానికి రాజ్యవ్యవస్థను మానవ సమాజం నిర్మించింది. రాజ్యవ్యవస్థ సమర్థంగా, నిజాయతీగా పని చేయటం మరి ముఖ్యంగా జనాభాలోని పేదలు, అవకాశాలు అందుకోలేని వర్గాల జీవితాలకు, వారి జీవనోపాధికి కీలకం! లోతైన ఆలోచన కలిగిన పరిశీలకులు పలు సందర్భాల్లో చెప్పినట్లు.. సమాజంలోని సంపన్నులు, బలవంతులు, బాగా చదువుకున్నవారు, మంచి ఆదాయమున్న వారు, ఉన్నత వర్గీయులు ప్రభుత్వాన్ని, మిగిలిన సమాజాన్ని పట్టించుకోవటం మానేశారు. వాళ్లకు సెక్యూరిటీ గార్డులున్న సొంత గేటెడ్ కమ్యూనిటీలుంటాయి, వాళ్లకు ప్రత్యేక నీటి సరఫరా, పారిశుద్ధ్య వ్యవస్థ ఉంటుంది, వాళ్లకు సొంత విద్యుత్తు జనరేటర్లు ఉంటాయి, స్టోరేజి బ్యాటరీలతో నిరంతర విద్యుత్తు సరఫరా ఉంటుంది, వాళ్లకు ఖరీదైన, ప్రత్యేకమైన ప్రయివేటు స్కూళ్లు, భారీ ఇన్సూరెన్స్ కవరేజీతో ఏ స్థాయి జబ్బుకైనా వైద్యసేవల్ని అందించగలిగే ప్రయివేటు ఆస్పత్రులు ఉంటాయి, వాళ్లకేదైనా సమస్య ఉంటే శక్తిమంతమైన అధికారులను, రాజకీయ నాయకులను తక్షణం కలిసి పరిష్కరించేసుకోగలరు. సంపన్న, శక్తిమంతమైన వారికి సమర్థవంతమైన, నిజాయతీ కలిగిన ప్రభుత్వం అవసరం లేదు. పరిపాలన ఎంత చెత్తగా ఉన్నా బతకటానికి, ఎదగడానికి వాళ్లకు మార్గాలు అందుబాటులో ఉంటాయి. ప్రభుత్వం విఫలమైతే తీవ్రంగా నష్టపోయేది పుట్టుకతో వివక్ష బాధితులైన పేదలు, అణగారిన వర్గాలు! సమర్థవంతమైన, నిజాయతీతో, మానవీయతతో కూడిన ప్రభుత్వం వీరి మనుగడకు, ఎదుగుదలకు ఎంతో అవసరం.

ఈవేళ్టి భారతదేశంలో అనేక రంగాలు పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. కానీ, పుట్టుకతో అసమానతల్ని కొనసాగించటానికి పెద్దఎత్తున కారణ మవుతున్న రాజ్యవ్యవస్థ పనితీరు, దాని సంస్థలకు సంబంధించిన ఐదు కీలక రంగాలపై మాత్రమే నేను ఇక్కడ దృష్టి పెట్టాలనుకుంటున్నాను.

మొదటిది, ప్రజలకు కనీస సేవల్ని

ప్రభుత్వం సక్రమంగా, కచ్చితంగా అందించటం! మంచినీరు, మురుగు పారుదల, వరద డ్రైనేజీ, పారిశుద్ధ్యం తదితర సేవల్ని అందించటం ప్రభుత్వ మౌలిక బాధ్యత. రోజువారీ జీవితానికి ఎంతో అవసరమైన ఈ సేవలను అందించటంలో ప్రభుత్వం విఫలమైతే, ప్రధానంగా పేదల జీవితాలు దుర్భరంగా మారతాయి, మెరుగైన భవిష్యత్తు కోసం వారు ఎంతో ఆరాటంతో చేసే ప్రయత్నాలకు ఆ మేరకు గండిపడుతుంది. ఇక్కడ ప్రస్ఫుటంగా కనిపించేది, గుర్తించాల్సినది - ఒక సాధారణ పౌరునికి, ఒక అతి దిగువ స్థాయిలో ఉన్నా సరే ప్రభుత్వోద్యోగికీ మధ్య నెలకొన్న భారీ అంతరం, అసమతుల్యత! మన దేశంలో పనిచేసేవారిలో 90 శాతం మందికి తక్కువ జీతాలు, ఆదాయమే ఉన్నాయి. వీళ్లంతా జీవన భద్రతలేకుండా అసంఘటిత రంగంలో ఉన్నవారు లేదా స్వయంఉపాధి పొందుతున్నవారు. దీనివల్ల, ఒక సాధారణ ప్రభుత్వోద్యోగి కూడా ఆర్థికంగా వీరి కంటే ఎక్కువ భద్రతను కలిగి ఉంటాడు, మెరుగ్గా చదువుకుని, విషయ పరిజ్ఞానం కలిగి ఉంటాడు, జనాభాలోని అత్యధికుల కంటే ఎక్కువ పలుకుబడి, అధికారం కలిగి ఉంటాడు! లంచాలు, వేధింపులు, జాప్యాలు లేకుండా సామాన్య పౌరులకు ప్రభుత్వ సేవల్ని సవ్యంగా అందించటంలో స్వతంత్ర భారతదేశ వైఫల్యం వల్ల మన ప్రజలు నిస్సహాయంగా అర్థించేవారుగా మిగిలిపోగా.. ప్రజాసేవకులుగా ఉండాల్సిన ఉద్యోగులు యజమానుల్లా తయారయ్యారు. ఇలా పాత్రలు తారుమారవటం, వలసపాలన నాటి మనస్తత్వం నుంచి బైటపడకపోవటం, లైసెన్స్-కంట్రోల్-పర్మిట్ విధానాలు కలగలిసి పేదలకు తీవ్ర నష్టం చేసి దేశాన్ని వెనక్కి గుంజుతూ వచ్చాయి. తమకు హక్కుగా అందాల్సిన మౌలిక సేవలకు దాదాపు 65 శాతం కుటుంబాలు ప్రతి సంవత్సరం లంచాలు చెల్లిస్తున్నాయని సర్వేలు సూచిస్తున్నాయి. వీరంతా బలవంతపు అవినీతి బాధితులు. తమకు అప్పనంగా మేలు చేయమనో, తమ పట్ల పక్షపాతం చూపాలనో వీరు అడగటం లేదు. తమకు హక్కుగా రావాల్సిన సేవలను సక్రమంగా అందించమని అడుగుతున్నారు. కానీ ఆలస్యాలు, వేధింపులు, అవమానాలు, అయోమయాలు, కొన్ని సందర్భాల్లో పూరించలేని నష్టానికి గురై నలిగిపోతున్నారు. పేదల నుంచి లంచాలు వసూలు చేయటం ఒక ఆనవాయితీగా మారిపోయింది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేసి పెట్టటం కోసం వీరు మధ్యవర్తుల సాయం కోరాల్సి వస్తోంది. స్థానిక రాజకీయ కార్యకర్తలు, పలుకుబడి గలవారి మీద ఆధారపడాల్సి వస్తోంది. ఫలితంగా పేదలు రాజకీయ బానిసత్వంలో శాశ్వతంగా మగ్గుతున్నారు. సార్వత్రిక ఓటుహక్కు, ప్రజాస్వామ్యం నానాటికీ బలహీనపడుతున్నాయి.

మౌలిక సేవలను వేగంగా, నిర్దిష్ట కాలపరిమితిలోగా అందించేట్టుగా మనకు సర్వీస్ గ్యారంటీని (హక్కుగా పౌర సేవలకు చట్టబద్ధ ఏర్పాటు) అమల్లోకి తేవాలి. గడువులోగా సేవలను అందించలేకపోతే పరిహారం చెల్లించాలి. యు.కెలో ఈ రకమైన సిటిజన్స్ చార్టర్లను జాన్ మేజర్ ప్రభుత్వం వ్యవస్థీకృతం చేసింది. అనేక దేశాలు దీన్ని అనుసరించాయి.




పౌర సేవల్ని సక్రమంగా అందించటానికి భారతదేశంలో ఇప్పటి వరకూ చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగలేదు. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సమస్యలు పరిష్కారమయ్యే చోట మినహాయించి, మిగిలిన అన్ని సేవల్లోనూ ఇదే పరిస్థితి. దీంతో, ప్రజల నెత్తిన అందనంత ఎత్తులో ఉన్న అధికార వ్యవస్థ, అధ్వాన్న పౌర సేవలు అలాగే కొనసాగుతూ ప్రజల్ని పీడిస్తున్నాయి. దీన్ని సరిదిద్దడానికి బదులుగా, భారత ప్రభుత్వం అడ్డగోలుగా తుగ్లక్ తరహాలో స్పందించింది. పౌర సేవల సంక్షోభం పరిష్కారం కాకపోగా వ్యతిరేక ఫలితాలు వచ్చేలా చట్ట సవరణ చేసింది. 2018లో పార్లమెంటు అవినీతి నిరోధక చట్టాన్ని ఏకగ్రీవంగా సవరించింది. వామపక్షాలు, దళిత, అగ్రకులాల అనే తేడా లేకుండా అన్ని పార్టీలూ ఈ సవరణలో ప్రభుత్వానికి మద్దతు పలికాయి. చట్టానికి రెండు దిగ్భ్రమ కలిగించే నిబంధనల్ని జోడించారు. మొదటిది, వేధింపులు లేకుండా సకాలంలో నాణ్యమైన పౌర సేవల్ని అందించే జవాబుదారీతనం కలిగిన నిర్మాణాన్ని ఏర్పాటు చేయటానికి బదులు.. ఓ చిన్నపాటి ధ్రువపత్రం కోసమో, విద్యుత్ మీటర్ కోసమో గతి లేక లంచమిచ్చే నిస్సహాయ బాధిత పౌరుడికి ఏడేళ్ల జైలుశిక్ష విధించేలా సవరణ చేశారు. కనీస శిక్ష మూడేళ్లు! దేశంలో ఇలా తప్పనిసరి శిక్ష చాలా నేరాలకు లేదుగానీ, నిస్సహాయ పౌరులకు మాత్రం వర్తింపచేశారు. లాలూచీ అవినీతి అయితే, లంచం ఇచ్చేవాడు, లంచం తీసుకునేవాడు ఇద్దరూ తమ అక్రమ లాభం కోసం దేశానికి నష్టం కలిగిస్తే, న్యాయమైన పోటీని అణగదొక్కితే లేదా ఏ రూపంలోనైనా ప్రజాప్రయోజనాలను కాలరాస్తే.. అప్పుడు మాత్రమే లంచం ఇచ్చేవాడు కూడా లంచం తీసుకునేవాడితో సమానంగా నేరస్తుడవుతాడు. చట్టపరంగా అప్పుడు మాత్రమే ఇచ్చేవాడి మీద కూడా కఠిన చర్యలు తీసుకోవాలి. కానీ బలవంతపు అవినీతికి బాధితులైన నిస్సహాయ సామాన్యులు తమకు హక్కుగా రావాల్సిన జనన లేదా ఆదాయ ధ్రువపత్రం, భూ రికార్డు లేదా హక్కుల రికార్డు పత్రం, నీటి సరఫరా, లేదా విద్యుత్తు కనెక్షన్‌కు గతి లేక లంచాలిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యానికి, బలవంతపు అవినీతికి బాధితులైనవారికి విధిగా మూడేళ్ల జైలు శిక్ష విధించటం ఎంత క్రూరమైన వైచిత్రి!

అటువంటి ధోరణులు పేదరికాన్ని, సామాజిక, ఆర్థిక అసమానతను ఇంకా కొనసాగిస్తాయి. కులపరమైన అణచివేతని, పుట్టుకతో ప్రతికూలతల్ని అధిగమించేలా రాజ్యవ్యవస్థ పేదలు, బలహీనులను బలోపేతం చేస్తుందని బాబాసాహెబ్ ఆశించారు. కానీ దానికి బదులుగా, పేదలను పిండి, వారిని ఇంకా అణగదొక్కే ఒక రాకాసిని మనం సృష్టించాం. చట్టానికి ఇంకో ఘోరమైన సవరణ కూడా చేశారు. గతి లేక లంచం ఇచ్చినవాడిని కఠినంగా శిక్షించటం ఒకపక్కయితే.. లంచం తీసుకునేవాడిని మాత్రం ప్రభుత్వ ముందస్తు అనుమతి లేకుండా కనీసం విచారణ కూడా చేయకూడదట! గతంలో అధికారుల ప్రాసిక్యూషన్‌కు మాత్రమే ముందస్తు అనుమతి రక్షణ ఉండేది. ఇప్పుడు ఏకంగా ప్రాథమిక విచారణకు కూడా అనుమతి తీసుకోవాలనే నిబంధన పెట్టారు. పేద, నిస్సహాయ పౌరునికి, ఆ పౌరునికి సేవకుడైన ప్రభుత్వోద్యోగికి మధ్య నిచ్చెనమెట్ల అంతరం ఎంత అగాథంలా ఉందో తెలియజెప్పటానికి ఇంతకంటే పెద్ద దృష్టాంతం కావాలా? మనకు నిజమైన జవాబుదారీతనం కావాలి, ప్రభుత్వం నుంచి హక్కుగా జరగాల్సిన పనులకు సర్వీస్ గ్యారంటీ ఏర్పాటు కావాలి, బలవంతపు అవినీతికి బాధితులైన సామాన్య ప్రజలను శిక్షించే క్రూరమైన చట్టసవరణల్ని ఉపసంహరించుకోవాలి. ఇవి చేయకుంటే, ప్రభుత్వ యంత్రాంగపు క్రౌర్యానికి, ద్రోహానికి పేదలు బలిపశువులవటం కొనసాగుతూనే ఉంటుంది.

నేను చెప్పదలచుకున్న రెండో అంశం చట్టబద్ధపాలన! చట్టపరంగా మనకు చట్టబద్ధపాలన ఉంది – చట్టం ముందు అందరూ సమానమే, చట్టం అందరి కంటే ఎక్కువ, ప్రభుత్వ జోక్యం లేకుండా న్యాయస్థానాలు స్వతంత్ర ప్రతిపత్తితో ఉంటాయి, చట్టప్రకారం పోలీసులు, ప్రాసిక్యూషన్ నిష్పక్షపాతంగా, స్వతంత్రంగా వ్యవహరించాలి అని రాజ్యాంగం హామీ ఇస్తుంది.. కానీ వాస్తవంలోకొచ్చి చూద్దాం. భారత దేశంలోని 4,00,000 ఖైదీల్లో 75 శాతం మంది విచారణ దశలో జైళ్లలో ఉన్నవారే. ఎక్కువమంది చిన్న చిన్న నేరాల ఆరోపణల మీద మగ్గుతున్నవారే. బెయిలుకు దరఖాస్తు చేసుకుని, సమర్థవంతమైన న్యాయ సహాయం పొందేందుకు డబ్బులేని పేదరికం వీరిది. కోర్టుల్లో నిందితులు నేరాన్ని ఒప్పుకోవటమనేది మనదేశంలో పేదలపై థర్డ్ డిగ్రీ పద్ధతుల్ని, హింసను ప్రదర్శించటం ద్వారానే జరుగుతోంది. ఈ రకంగా బలవంతపు నేరాంగీకారం లేకుంటే, దేశంలో నేరాల్ని ఒప్పుకునేవారి సంఖ్య కేవలం 10 శాతం వరకు మాత్రమే ఉంటుంది. ప్రపంచంలోనే ఇది అతి తక్కువ. దాదాపు 3 కోట్ల కేసులు – రెండొంతులు క్రిమినల్, ఒక వంతు సివిల్ – మన కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయి. సంక్లిష్టమైన, ఉదాసీనమైన న్యాయ పద్ధతులు, ఎడతెగని వాయిదాలు, ఖర్చుతో కూడిన వ్యాజ్యాలు, సివిల్ కేసులను తెమల్చటంలో ఏళ్లు, దశాబ్దాల ఆలస్యం, న్యాయవ్యవస్థ అందుబాటులో లేకపోవటం కారణంగా సివిల్ వివాదాన్ని పరిష్కరించుకోవటానికి, తమ హక్కులను అమలు చేయించుకోవటానికి కోర్టులకు రావటానికి చాలా మంది పేద, మధ్య తరగతి ప్రజానీకం ధైర్యం చేయలేక పోతున్నారు. ఎక్కువమంది పేదలు.. జరిగిన అన్యాయాన్ని దిగమింగుకుంటూ నిశ్శబ్దంగా కన్నీరు కారుస్తున్నారు. కొందరు ఏదన్నా న్యాయం జరుగుతుందనే ఆశతో లంచం ఇస్తున్నారు; లేదా స్థానిక గూండా లేదా నేరచరితుడి దగ్గరకెళ్లి డబ్బులిచ్చి దౌర్జన్యంతో తక్షణ బందన్యాయం పొందే ప్రయత్నం చేస్తున్నారు.

వీటన్నింటి పర్యవసానం – న్యాయం సమిధవటం! పేదలే బలిపశువులవుతుంటారు, పేదరికం కొనసాగుతూనే ఉంటుంది. కాగితాల మీద ప్రకటనల్లో కాకుండా – నిరుపేదలకు, అత్యంత బలహీనులకు ఆచరణలో న్యాయం అందించలేని సమాజం.. పేదరికాన్ని, వివక్షను లేదా అణచివేతను నిర్మూలించలేదు. చట్టబద్ధపాలనను అమలు చేయటం ప్రభుత్వ మొట్టమొదటి బాధ్యత! మన పోలీసు వ్యవస్థలో విస్తృతమైన సంస్కరణల్ని అమలు చేయాలి. ముఖ్యంగా నేరదర్యాప్తులో, అక్కడ్నుంచి ప్రాసిక్యూషన్, న్యాయప్రక్రియ, న్యాయవ్యవస్థల్లో! ఈ మార్పుల్ని తెస్తేనే సామాజిక న్యాయానికి కనీసస్థాయి భరోసా కల్పించగలం.

ఇక నేను ప్రస్తావించదలచిన మూడో కీలకాంశం.. ప్రజలకు జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్యను, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యాన్ని అందించడంలో ప్రభుత్వ వ్యవస్థ వైఫల్యం గురించి! మన పాఠశాల విద్య అధ్వాన్న స్థితిలో ఉంది. ఉచిత, నిర్బంధ ప్రాథమిక విద్యకు గ్యారంటీ ఇచ్చే ఓ చట్టాన్ని తెచ్చారు. త్వరలో దీన్ని ప్రాథమికోన్నత విద్యకు కూడా వర్తింపచేస్తారు. ప్రభుత్వం గణనీయమైన డబ్బుని మన పాఠశాలల్లో ఖర్చు చేస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో ఒక్కో బిడ్డ మీద ప్రభుత్వ స్కూళ్లలో చేస్తున్న ఖర్చు ఏడాదికి రూ.50,000 నుంచి 70,000 వరకూ ఉంది.. కానీ చాలామంది విద్యార్థులకు అబ్బుతున్న నిజమైన విద్య అరకొరే! ఈ నిరాశానిస్పృహల వల్ల, పేదలు తమ ఆదాయాన్ని మించి పెద్ద మొత్తాల్ని ఖర్చు చేస్తూ తమ పిల్లల్ని ప్రయివేటు స్కూళ్లకు పంపుతున్నారు. కానీ ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా ఎక్కువశాతం పాఠశాలల్లో ఫలితాలు ఘోరంగా ఉన్నాయి. 'అసర్' వంటి

అత్యంత విశ్వసనీయత గల సర్వేలు ప్రతి ఏటా ఈ దుర్భర వాస్తవాల్ని తెలియ జెబుతున్నాయి. ప్రభుత్వ, ప్రయివేటు స్కూళ్లలో 8వ తరగతి చదివే విద్యార్థుల్లో.. 25-30 శాతం మంది కనీసం చదవలేరు, 30-40 శాతం మంది సాధారణ రెండంకెల తీసివేతను చేయలేరు, 50-60 శాతం మంది మూడంకెల సంఖ్యను ఒక అంకెతో భాగాహారం చేయలేరు. భాగాహారం, తీసివేత వంటివి ఎందుకు, ఏ సందర్భంలో చేయాలి.. వంటి చిన్నపాటి క్లిష్ట ప్రశ్నలు కూడా ఇందులో లేవు. కేవలం చిన్న కాన్సెప్ట్‌తో లెక్క చేయటం మాత్రమే వీరికి ఇచ్చారు. ఆ మాత్రం ప్రశ్నకే ఫలితాలు అలా ఉన్నాయి. 2009లో 'పీసా' సర్వేను పదిహేనేళ్ల వయసు విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాలను అంచనా వేయటానికి 74 దేశాలు/ఎంటిటీల మధ్య నిర్వహించారు. ఇందులో భారతీయ విద్యార్థులు దిగువ నుంచి రెండో స్థానంలో ఉన్నారు. మనకంటే అట్టడుగున ఉన్నది కిర్గిజిస్థాన్ మాత్రమే! పీసా సర్వేను చూశాక భారత ప్రభుత్వ ప్రతిస్పందన విద్యాప్రమాణాలను పెంపొందించటం కాదు.. ఆ సర్వేను తిరస్కరించటం! ప్రపంచ స్థాయి సర్వే నుంచి భారత్ వైదొలుగుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. తిరిగి 2021లో పీసా సర్వేలో పాల్గొంటున్నట్లు ఇటీవల చదివాను. ఏంటీ వార్త.. అని వివరాల్ని పరిశీలించాను. కేవలం కేంద్రీయ విద్యాలయాల్లో పిల్లలకు మాత్రమే పీసా సర్వేను వర్తింపచేస్తామని మళ్లీ దాటవేసినట్లు తేలింది. విద్యా వైఫల్యం ఎప్పుడూ దాదాపుగా పేదలనే దెబ్బతీస్తుంది. పేదరికాన్ని, కులపరమైన అణచివేతను కొనసాగించటానికి నాణ్యమైన విద్యను అందకుండా చేయటం కంటే వేరే పెద్దగా ఏమీ చేయనక్కర్లేదు!

మన ఆరోగ్య సేవల పరిస్థితి ఇంతకంటే పెద్ద భయానకం! భారత్‌లో ఏటా నివారించదగ్గ వ్యాధులతో 5 ఏళ్లలోపు వయసున్న 12 లక్షలమంది పిల్లలు చనిపోతున్నారు, అనారోగ్యం వల, వైద్య ఖర్చులు భరించలేక ప్రతి ఏడాదీ 6 కోట్ల మందికిపైగా అప్పటిదాకా పేదరికానికి ఎగువన ఉన్నవారు తిరిగి పేదరికంలోకి జారిపోతున్నారు. భారత్‌లో పేదరికానికి, ప్రజలు అప్పుల్లో కూరుకుపోవటానికి అనారోగ్యం అతి పెద్ద కారణం. ఆరోగ్య సేవల్ని అధ్వాన్నంగా కొనసాగిస్తున్న ప్రభుత్వ విధానాల వల్ల దారుణంగా నష్టపోతున్నది పేదలు, దిగువ మధ్యతరగతి, అణగారిన వర్గాలవారే.

కానీ ప్రభుత్వాల విధానాలు ఇంత సంక్షోభాన్ని కొనసాగిస్తున్నా.. పరిష్కారాలు కూడా అందుబాటులో ఉండటం ఆశావహ పరిస్థితిని కల్పిస్తోంది. విద్య, వైద్య ఆరోగ్య సంక్షోభం నుంచి ఊరట కలిగించే పరిష్కారాలున్నాయి. ఇప్పుడు చేస్తున్న ఖర్చుతోనే మన పాఠశాల విద్యా ప్రమాణాల్ని మెరుగుపరచుకోవచ్చు, ప్రజారోగ్యంపై జీడీపీలో ఇప్పుడు చేస్తున్న 1 శాతం ఖర్చును న్యాయమైన పద్ధతిలో 2 శాతానికి పెంచితే, మన ఆరోగ్య వ్యవస్థలో విప్లవాత్మక మార్పుల్ని తేవచ్చు. కానీ మన ప్రభుత్వాలు పరిష్కారాలను పట్టించుకోకుండా దశాబ్దాల ఉదాసీనత, నేరసమాన నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తున్నాయి. భారత్‌లో ప్రయివేటు, బహుళ జాతి పెట్టుబడులు పెద్దఎత్తున ఉన్నది పాఠశాల విద్యలో, తృతీయ దశ వైద్యసేవల్లో! నాణ్యమైన విద్యకు, తృతీయ స్థాయి వైద్యసేవలకు డిమాండ్ ఇంకా ఇంకా పెరుగుతుందని, భవిష్యత్తులో జనం విధిలేని పరిస్థితుల్లో ఇంకా ఇంకా జేబుల్లో నుంచి ఖర్చు పెడతారని ఈ పెట్టుబడిదారులు గ్రహించారు. భారత రాజ్యవ్యవస్థ విద్యను, ప్రజారోగ్యాన్ని బాగు చేయదని, కాబట్టి ఈ రంగాలు అద్భుతమైన ఆదాయ కేంద్రాలని వాళ్లు జంకూగొంకూ లేకుండా పెట్టుబడుల్ని కుమ్మరిస్తున్నారు. ప్రతి బిడ్డకూ, ప్రతి కుటుంబానికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యాలకు గ్యారంటీ ఇవ్వకుండా.. మనం అణగారిన వర్గాల సామర్థ్యాలను, ఉత్పాదక శక్తిని పెంచలేం. యథాతథస్థితినే కొనసాగిస్తామంటే.. పేదరికం, అవకాశాలలేమి అలాగే కొనసాగుతూంటాయి.

ముఖ్యమైన నాలుగో అంశం స్థానిక ప్రభుత్వాలు. అధికారాన్ని పైస్థాయిలో కేంద్రీకరించటం వల్ల పౌర సేవలు సక్రమంగా అందటం లేదు, జవాబుదారీతనం కొరవడింది, ఓటుకు-ఫలితాలకు; పన్నులకు-సేవలకు మధ్య సంబంధం తెగిపోయింది. సాంప్రదాయ గ్రామాలలో స్థానిక ప్రభుత్వాల వల్ల కులపరమైన అణచివేత, వివక్ష ఇంకా పెరుగుతాయని డా॥ అంబేద్కర్ భయపడ్డారు. భారతీయ సాంప్రదాయ గ్రామాలు "కుల, అవినీతి స్థావరాలు" అని ఆయన చక్కగా అతికినట్లు అభివర్ణించారు. అయితే ఆ అవరోధాన్ని అధిగమించడానికి.. ఓ గ్రామానికి బదులు గ్రామాల సమూహమనే పెద్ద యూనిట్‌ను గణతంత్ర భారతదేశం ప్రాతిపదికగా తీసుకోవాల్సింది. సాంప్రదాయ గ్రామాలను 20,000 - 30,000 జనాభాకొకటి చొప్పున సమూహంగా కలిపి, ఆ సముదాయాన్ని (క్లస్టర్) స్థానిక ప్రభుత్వాలకు ప్రాథమిక యూనిట్‌గా ఏర్పాటు చేసి ఉండాల్సింది. అలా చేయకుండా, 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా పటాటోపం తప్ప పవర్‌లేని స్థానిక ప్రభుత్వాలను రూపొందించారు. ఉద్దేశం మంచిదే అయినా, పర్యవసానాల్ని పరిగణలోకి తీసుకోకపోవటం వల్ల జరిగిన నష్టమిది! స్థానిక ప్రభుత్వాలను సమూలంగా ప్రక్షాళన

చేసి సాంప్రదాయ కుల వివక్ష, విభజనలకు అవకాశం లేకుండా పెద్ద యూనిట్లుగా ఏర్పాటు చేయాలి. దీనివల్ల మౌలిక వసతులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు కావలసిన ఆర్థిక వనరులు సమకూరతాయి; నిర్వహణ సామర్థ్యం కొరత కూడా తీరుతుంది. గ్రామాల సముదాయంగా ఉండే ఒక పెద్ద యూనిట్ ప్రాతిపదికన సార్వత్రిక ఓటు హక్కుకి ఉండే ప్రభావం వల్ల కుల అసమానతలు పలచబడతాయి. అటువంటి స్థానిక ప్రభుత్వాలకి నిజమైన సాధికారత, వికేంద్రీకరణను స్వతంత్ర అంబుడ్స్‌మన్‌కి జవాబుదారీతనంతో అందిస్తే ప్రజలకు సేవలు మెరుగవుతాయి, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మహిళలకు ప్రాతినిధ్యం వహించే వారికి నిజమైన నాయకత్వం, సాధికారత లభిస్తుంది. స్థానిక ప్రభుత్వాల్లో గణనీయంగా కల్పించిన రిజర్వేషన్లకు సార్థకత చేకూరుతుంది. తగినన్ని వనరులు, అధికారాలు లేకుండా ఓ చిన్న, సాంప్రదాయ, కులతత్వ గ్రామానికి ప్రాతినిధ్యం కల్పించటం మొత్తం మూడో అంచె ప్రభుత్వాన్ని, స్థానిక రిజర్వేషన్లను నీరుగార్చింది.

చివరిగా, రాజ్యాంగం అమల్లోకొచ్చిన దాదాపు ఏడు దశాబ్దాల తర్వాత మనం మన రాజకీయాలు, ఎన్నికల వ్యవస్థల తీరుతెన్నుల మీద సమీక్ష చేసుకోవాలి. జాతీయ స్థాయిలోని కేంద్రీకృత పాలన, ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన వారు మినహా మిగిలిన అభ్యర్థులంతా ఓడిపోయినట్లే అనే మన ఫస్ట్-పాస్ట్-ది-పోస్ట్ ఎన్నికల పద్ధతి.. మన అపరిపక్వ ప్రజాస్వామ్యంలోని అత్యంత అవలక్షణాలను ఘోరమైన స్థితికి దిగజార్చాయి. ఈవేళ ఓట్ల కొనుగోలు చేయటం, పేదరికం, అసంఖ్యాక ప్రజల ఆదాయావకాశాలు తగ్గిపోవటానికి మూలమైన సంస్థాగత సమస్యలను పట్టించుకోకుండా సబ్సిడీలు, తాత్కాలిక తాయిలాల మీద విపరీతంగా ఖర్చు చేయటం, కులం, ప్రాంతం, మతంపై ప్రజలను చీల్చి ఓట్లను పొందే ధోరణి పెరుగుతుండటం.. ఇవి మన ఎన్నికల ప్రజాస్వామ్య లక్షణాలుగా తయార య్యాయి. మనకు రాజకీయ స్వేచ్ఛ లున్నాయి, తీవ్రమైన ఎన్నికల పోటీ ఉంది, అధికార మార్పిడి చాలామట్టుకు శాంతియుతంగానే జరుగుతోంది. వీటన్నిటి వల్లే మనది పనిచేసే ప్రజాస్వామ్యంగా మనుగడ సాగించ గలుగుతోంది. అంబేద్కర్, ఇతర జాతి నిర్మాతల దార్శనికత, ముందుచూపునకు మనం కృతజ్ఞులమై ఉండాలి. వారి వేసిన పునాది వల్లే మనం ఇంత సంక్లిష్ట భిన్నత్వం ఉన్న దేశంలో కూడా ఐక్యతను, స్వేచ్ఛను కాపాడుకోగలిగాం, బహుభాషల మధ్య భాషా సామరస్యతను పెంపొందించు కోగలిగాం, కొంతమేర మన ఫెడరల్ వ్యవస్థను బలోపేతం చేసుకోగలిగాం. కానీ ఇప్పటికీ మనలోని శక్తిసామర్థ్యాలను పూర్తిస్థాయిలో వికసింప చేసుకోలేక పోతున్నాం. రాజ్యాంగం హామీ ఇచ్చిన న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వాలు.. కులం, పేదరికం కింద నలిగిపోతున్న కోట్లాదిమందికి ఇంకా ఊహకు కూడా అందని విషయాలుగానే మిగిలిపోయాయి.

సమాజంలోని సాంప్రదాయ దృక్పథాలకు – రాజ్యాంగ విలువలు, దార్శనికతకు మధ్య ఎప్పుడూ అంతరం ఉంటుంది. రాజకీయ, పాలన, న్యాయ ప్రక్రియలు, ప్రభుత్వ యంత్రాంగం, పనితీరు.. కుల అణచివేతకు, సమానత్వానికి; ప్రతికూలతలకు, అవకాశాలకు; విభజనకు, సామరస్యతకు మధ్య వారధిగా వ్యవహరించాలి! అంబేద్కర్ చేసిన కృషి కొంత ఫలితాన్ని సాధించింది, కానీ ఆయన కలను నెరవేర్చడంలో మనం ఇంకా చాలా వెనుకబడి ఉన్నాం. మనం చేయాల్సింది చాలా ఉంది. ఇందుకు అనుసరణీయమైన, వాస్తవికమైన, ఆచరణసాధ్యమైన, సాధించ గల, ఆమోదయోగ్యమైన వ్యవస్థీకృత, పాలన, న్యాయ, రాజకీయ సంస్కరణలు అందుబాటులో ఉన్నాయి. మన అనుభవాలు, ఇతర దేశాల్లోని అత్యున్నత పద్ధతులను మదించి తయారుచేసినవివి. న్యాయం, ఎదిగే అవకాశాలను మనం నమ్ముతూంటే.. యధాతథస్థితి పరిష్కారం కాదు. శక్తి సామర్థ్యాలను వికసింప చేసుకునే అవకాశాలు లేకపోవటం, నివారించదగ్గ బాధలు కొనసాగటం.. ఇవి రెండూ సమాజం చేస్తున్న పెద్దపాపాలని నేను నమ్ముతాను. మన జాతి నిర్మాతల దార్శనికత నుంచి స్ఫూర్తితో, మన అనుభవాలందించిన విజ్ఞత నుంచి సృజనాత్మకతతో వ్యవహరించగలిగితే మనం ఆ పాపాల నుంచి విముక్తిని సాధించగలం.

(భారతరత్న డా॥ బీఆర్ అంబేద్కర్, డా॥ బాబూ జగ్జీవన్ రామ్‌ల జయంతి సందర్భంగా ఏప్రిల్ 23, 2019న హైదరాబాద్ ఉస్మానియా విశ్వ విద్యాలయంలో లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన కీలకోపన్యాస పాఠానికి స్వేచ్ఛానువాదమిది. ఓయూ ఎస్.సి/ఎస్.టి విభాగం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆంగ్లంలో ఉన్న జేపీ ఉపన్యాస పాఠాన్ని పుస్తకరూపంలో కూడా ప్రచురించి ఈ సందర్భంగా విడుదల చేశారు. జేపీ ప్రసంగపాఠం ఆంగ్ల మూలానికి, ప్రసంగం వీడియోకు www.twitter.com/jp_loksatta,www.facebook.com/jploksatta,www.fdrindia.org లను సందర్శించగలరు). ❍

# తెలుగువారి ఆత్మీయ నేత

- డాక్టర్ జి.లీలావరప్రసాదరావు

***అంబేద్కర్ ఇష్టపడిన అతికొద్ది నగరాల్లో హైదరాబాద్ ఒకటి. భాగ్యనగరంలోని పార్కులన్నింటిలోనూ సాయంత్రం సరదా జ్ఞాపకాలు, చర్చలు ఎన్నో అంబేద్కర్ జీవితంలో తారస పడతాయి. 1944 సెప్టెంబర్‌లో అంబేద్కర్ ఆంధ్రప్రాంతంలో పర్యటించారు. విజయవాడ మొదలుకొని విశాఖపట్నం వరకూ ఆయన పర్యటన సాగింది. ఆయన ప్రసంగాలను అమలాపురానికి చెందిన నందనారు హరి తెలుగులోకి అనువదించేవారు.***



నవభారత నిర్మాత, సమసమాజ దార్శనికుడు, ఆధునిక సామాజిక చైతన్యదీప్తి, బహుజన బంధువు డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు తెలుగు వారన్నా, తెలుగు నేలన్నా ఎంతో ఇష్టం. ప్రస్తుతం వేరుపడిన తెలుగునేలలు రెండు కూడా అంబేద్కర్ అంటే ఇష్టపడినవే, ఆయనకు కూడా అవంటే ఇష్టమైనవే. భారతదేశంలో అంబేద్కర్ ఇష్టపడిన అతికొద్ది నగరాలలో హైదరాబాద్ ఒకటి. ఆయన అభివృద్ధిలో ఈ నగరం ఎంతగానో అండగా నిలిచింది. అందుకే ఆయన బంబాయి, ఢిల్లీ తర్వాత అత్యధికంగా పర్యటించి, గడిపిన నగరాల్లో హైదరాబాద్ కూడా ఉంది. భాగ్యనగరంలోని పార్కులన్నింటిలోనూ సాయంత్రం సరదా జ్ఞాపకాలు, చర్చలు ఎన్నో అంబేద్కర్ జీవితంలో తారసపడతాయి. ఆయన పుట్టిన మహారాష్ట్ర తర్వాత అత్యధిక సంఖ్యలో అంబేద్కర్‌కు అప్పటికే అభిమానులు, అనుచరులు ఉన్నది ఆంధ్ర, హైదరాబాద్ రాష్ట్రాల్లోనే. ఆయన పుట్టిన రాష్ట్రానికి కాకుండా హైదరాబాద్‌ను దేశానికి రెండో రాజధాని చేయమని అంబేద్కర్ పదేపదే ప్రస్తావించడం తెలుగువారిపై ఆయనకు గల అభిమానానికి నిలువెత్తు నిదర్శనం. హైదరాబాద్ సంస్థానం పాలకులతోనూ అంబేద్కర్‌కు మంచి సంబంధాలు ఉండేవి. 1931-32 మధ్య కాలంలో అంబేద్కర్ ఉన్నతవిద్యకు, సామాజిక ఉద్యమాలకు నిజాం నవాబు అండగా నిలుస్తూ తమ ఆర్థికశాఖ నుంచి 15 వేల రూపాయలు ప్రకటించడమే కాకుండా నెలకు అయిదు వందలు చొప్పున్న మూడేళ్ళ పాటు సహాయం చేశారు. దీంతో తెలుగువారితో అంబేద్కర్ జీవన ప్రయాణం మరింతగా పెనవేసుకుంది.

మరోవైపు అంబేద్కర్ పలుమార్లు పర్యటనలు జరిపి తెలుగు ప్రజలను కలుసుకునే ప్రయత్నం చేశారు. దేశానికి స్వాతంత్ర్యంతోపాటు బహుజనులకు కూడా స్వాతంత్ర్యం కావాలని ఆకాంక్షిస్తూ తెలుగు నేలలో పలు చైతన్యయాత్రలు జరిపారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో తెలుగు నేలలో పలు ప్రాంతాల్లో అంబేద్కర్ పర్యటించారు. యుద్ధమనేది బ్రిటీష్‌వారి సొంత వ్యవహారమని, యుద్ధం మన లక్ష్యం కాదని, సామాజిక స్వాతంత్ర్యం మన గమ్యమంటూ తన ప్రసంగాల ద్వారా ఇక్కడి ప్రజలను చైతన్యపరిచారు.

1944 సెప్టెంబరులోనూ డాక్టర్ అంబేద్కర్ ఆంధ్రప్రాంతంలో పర్యటించారు. విజయవాడ మొదలుకొని విశాఖపట్నం వరకూ ఆయన పర్యటన సాగింది. బెజవాడ రైల్వేస్టేషన్‌లోనూ, గుడివాడ మెయిన్‌రోడ్‌లోనూ ప్రజలనుద్దేశించి ఉపన్యసించారు. ఏలూరు సందర్శించిన సందర్భంగా మునిసిపల్ కార్యాలయంలో అంబేద్కర్‌కు ఘనసన్మానం జరిగింది. కొవ్వూరులో ఎస్.సి కాలనీని సందర్శించి అక్కడివారితో గడిపారు. తాడేపల్లిగూడెంలో ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పాలకొల్లు పర్యటన తర్వాత రామచంద్రపురం దగ్గర వాడపల్లిలో హాస్టల్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. రాజమండ్రి వచ్చిన సందర్భంగా అక్కడి టౌన్‌హాల్‌లో పౌరసన్మానం జరిగింది. తర్వాత పిఠాపురం వచ్చి ఎస్.సి బాలుర వసతి గృహాన్ని సందర్శించారు. తుని


రైల్వేస్టేషన్ వద్ద ప్రసంగించి అనకాపల్లి చేరుకోగా భారీ సంఖ్యలో ప్రజలు, అభిమానులు అంబేద్కర్‌కు అక్కడి రైల్వేస్టేషన్ వద్ద స్వాగతం పలికారు. అక్కడి మునిసిపల్ స్కూల్‌లో జరిగిన సభలో ప్రసంగించిన అనంతరం, పట్టణ ప్రజలు అంబేద్కర్‌కు ఘనసత్కారం చేశారు. పర్యటనలో భాగంగా విశాఖ సిటీకి వచ్చి పోర్టులో కార్మికులను కలిశారు. తర్వాత కలెక్టరేట్ వద్ద జరిగిన సభలో మాట్లాడారు. అంబేద్కర్ ఆంధ్రలో పర్యటించినప్పుడు ఆయన ప్రసంగాలను అమలాపురానికి చెందిన నందనారు హరి తెలుగులోకి అనువదించేవారు.

అట్టడుగు వర్గాల కోసం, వారికి రాజ్యాధికారం అందించడం కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జాతీయస్థాయిలో ఓ ప్రత్యేక రాజకీయ పార్టీని కూడా స్థాపించారు. 'అఖిల భారత నిమ్నజాతుల సమాఖ్య'ను ఏర్పాటు చేశారు. 1952లో పార్లమెంట్‌కు జరిగిన తొలి సాధారణ ఎన్నికల్లో 34 చోట్ల ఈ పార్టీ పోటీ చేసింది. వాటిలో రెండు సీట్లలో ఈ పార్టీ అభ్యర్థులు గెలవగా, అందులో ఒకటి తెలుగునేల నుంచే. ఒకటి షోలాపూర్ కాగా రెండోది కరీంనగర్ పార్లమెంట్ స్థానం. ఈ స్థానం నుంచి ఎంఆర్ కృష్ణ గెలుపొంది ఆ పార్టీకి పార్లమెంట్‌లో ప్రాతినిధ్యం వహించారు. ఈ ఎన్నికల్లో అంబేద్కర్ కూడా ఓటమి చెందారు. మరోవైపు వివిధ రాష్ట్రాల్లో 215 స్థానాల్లో పార్టీ పోటీచేయగా 12 స్థానాలను గెలుచుకుంది. అందులో హైదరాబాద్ రాష్ట్రంలో అయిదు కాగా, ఆంధ్రా ప్రాంతం నుంచి ఆనాడు బజ్జా అప్పలస్వామి అమలాపురం నుంచి, స్వర్ణ వేమయ్య నెల్లూరు నుంచి ఎమ్మెల్యేలుగా అంబేద్కర్ పార్టీ తరపున గెలుపొందారు. మరోవైపు హైదరాబాద్ రాష్ట్రం నుంచి జెహెచ్ సుబ్బయ్య రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు (1951 సెప్టెంబర్‌లో కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత వారం రోజుల విశ్రాంతి కోసం అంబేద్కర్ హైదరాబాద్ వచ్చి సికింద్రాబాద్‌లోని పెండర్‌గాస్ట్ వీధిలోని సుబ్బయ్య నివాసంలో ఉన్నారు).


దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను గుర్తించి ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్‌తో గౌరవించింది. 1953 జనవరి 12వ తేదీన జరిగిన ఉస్మానియా యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టర్ ఆఫ్ లిటరేచర్ ప్రకటించిన తన ప్రతిష్ఠను ఓయూ పెంచుకుంది. భారతదేశంలో ఆయనకు మొదటి గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించిన విశ్వవిద్యాలయం ఓయూయే కావడం తెలుగువారందరికీ ఎంతో గర్వకారణం. దీన్ని అందుకునేందుకు స్వయంగా అంబేద్కర్ ఓయూకు వచ్చారు. ❍

# 'అతి'.. కోపం, బాధ, భయం, మనుషుల్లో మునుపెన్నడూ లేనంత సంఘర్షణ!

మనుషుల్లో సహజంగా ఉండే సంతోషం, విచారం, కోపం, బాధ, భయం.. వంటి భావోద్వేగాలు ఇటీవల ఒత్తిడి కారణంగా శృతిమించి పోతున్నాయని ఓ అధ్యయనం తెలిపింది. చిన్న చిన్న కారణాలకే విపరీతంగా మథన పడుతూ కుంగి పోతున్నవారి సంఖ్య వేగంగా పెరుగుతోంది. అతి కోపంతో ఎదుటివాళ్లపై అంతెత్తున గంతులేస్తున్నారు.



మునుపెన్నడూ లేనంత తీవ్రస్థాయిలోకి మనుషుల్లో కోపం, బాధ, భయం చేరిపోయాయని 'గ్యాలప్' తాజా ప్రపంచ భావోద్వేగాల పరిశీలనలో వెల్లడైంది. 2017తో పోలిస్తే 2018లో ఈ మూడు భావోద్వేగాలు తారాస్థాయికి చేరాయని ఆ నివేదిక పేర్కొంది. 140 దేశాలకు చెందిన 1,51,000 మందిని ఇంటర్వ్యూ చేసి ఈ విషయాన్ని గుర్తించారు. ఈ నివేదిక ప్రకారం ప్రతి పదిమందిలో నలుగురు తీవ్రంగా ఆందోళన చెందుతుండగా.. ముగ్గురు ఒత్తిడికి గురవుతున్నారు. ఇక 25 శాతం మంది బాధతో.. 22 శాతం మంది తీవ్ర కోపంతో రగిలి పోతున్నారు. గత 12 నెలల్లో యుద్ధ వాతావరణం, రాజకీయ సంక్షోభాలు, ఇతర అత్యవసర పరిస్థితులు ప్రపంచంలో నెలకొన్నాయని, ఇందులో మధ్య ఆఫ్రికాలోని చాడ్ దేశం అత్యంత ప్రతికూల దేశంగా నిలిచిందని నివేదిక తెలిపింది. దాని తర్వాత స్థానంలో నైజర్, సియెర్రా లియోన్, ఇరాక్, ఇరాన్, బెనిన్, లిబేరియా, గినియా దేశాలు ఉన్నాయని పేర్కొంది. అయితే, ప్రపంచంలో చాలా దేశాలు ప్రతికూల ధోరణితో వెళ్తుంటే లాటిన్ అమెరికాలో మాత్రం సానుకూల ధోరణి పెరుగుతోందని వెల్లడైంది. ఆ దేశంలో ప్రతి పదిమందిలో ఏడుగురికిపైగా సంతోషంగా ఉన్నారని తేలింది.




సమయంలో ఆయన తన ఆధ్యాత్మిక ఆసక్తులకు అనుగుణంగా వ్యవహరించారు. ప్రజల లౌకిక ప్రయోజనాలు, నాయకుని ఆధ్యాత్మిక ఆసక్తులు ఎటువంటి వైరుధ్యం లేకుండా ఒకేసారి కలసికట్టుగా నెరవేరగలవు. నాయకులు తమ లౌకిక ప్రయోజనాలను అధిగమించి, ఉన్నతాదర్శాల సాధనకు కృషి చేసేలా వారిని పురిగొల్పడం ఎలా? అనేది మనం ఆలోచించి, నిర్ణయించుకోవాల్సిన విషయం.

సమాజ వ్యవహారాలలో సాధువు పాత్రను మరింత శక్తిమంతం చేయడమే ఈ చిక్కు సమస్యకు హిందూ ధర్మ పరిష్కారం. బ్రాహ్మణుడు, క్షత్రియుడి మధ్య ఈ ధర్మం ఒక ప్రత్యేకతను పాటించింది. క్షత్రియులను

# 'సామాజిక' భ్రష్టత్వం ఈ దేశ దౌర్భాగ్యం

**- భరత్ ఝున్‌ఝున్‌వాలా,** ఆర్థికవేత్త

ఆధ్యాత్మికుల సామాజిక బాధ్యత అన్న భావన సంప్రదాయ భారతీయ పాలనా వ్యవస్థకు ప్రాతిపదిక. భౌతిక జగత్తు మిథ్య అన్న వేదాంత విశ్వాసం ఆ భావనను కూల్చివేసింది. పాలకుల అవివేకాన్ని ప్రశ్నించే, ఎదిరించే కర్తవ్యాన్ని త్యజింప చేసింది. పర్యవసానంగానే నేటి పాలకపక్షాలు ఎటువంటి సంకోచం లేకుండా ప్రజా వ్యతిరేక విధానాలను అనుసరించగలుగు తున్నాయి.

స్వప్రయోజనాలకు కాకుండా ప్రజాశ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని పాలకులు వ్యవహరించేలా చేయడం ఎలా? పాలనకు సంబంధించిన మౌలిక సమస్య ఇది. ఇదే సమయంలో ప్రతి మనిషీ తన సొంత ప్రయోజనానికే ప్రాధాన్యమిస్తాడనే సత్యాన్ని మనం విస్మరించకూడదు. దీన్నిబట్టి రెండు పరస్పర విరుద్ధ విషయాలను కాంక్షిస్తున్నామని చెప్పక తప్పదు. ఒకపక్క మన నాయకులు తమ సొంత ప్రయోజనాలకు అతీతంగా వ్యవహరించాలని మనం కోరుకుంటున్నాము, మరోపక్క నాయకులు అనివార్యంగా తమ సొంత ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరించడాన్ని అంగీకరిస్తున్నాము!

ఇదొక చిక్కు సమస్య. మరి దీనికి పరిష్కారమేమిటి? స్వప్రయోజనంలో వివిధ స్థాయిలు ఉన్నాయనే వాస్తవాన్ని మనం గుర్తించి తీరాలి. డబ్బు అవసరాలు, అధికార లాలస అంశాలలో మోహన్ దాస్ కరంచంద్ గాంధీ తన వ్యక్తిగత ప్రయోజనాలను అధిగమించారు, అదే

బ్రాహ్మణులు మాత్రమే నియంత్రించాలని మను స్మృతి నిర్దేశించింది. తన తదుపరి భోజనం ఎక్కడనుంచి వస్తుందనే విషయం తెలియనివాడే ఉత్తమ బ్రాహ్మణుడు అని కూడా ఆ స్మృతి కారుడు పేర్కొన్నాడు. బ్రాహ్మణుడి స్వచ్ఛంద పేదరికం క్షత్రియులను ఎదిరించి నిలబడగలిగే, సత్యాన్ని ప్రవచించగలిగే శక్తిని, నిబ్బరాన్ని ఇస్తుంది. కనుకనే నేపాల్ నిరంకుశ పాలకుడిని గురు గోరఖ్‌నాథ్ ఎదిరించాడు. తన తపశ్శక్తితో వర్షాలు కురవకుండా చేశాడు. నిరంకుశ పాలకుడు తన అనుగ్రహాన్ని అర్థించే విధంగా చేశాడు. బ్రాహ్మణుడు, ముని లేదా సాధువుకు విధిగా ఒక పాత్ర ఉండాలని, ఆ ఆధ్యాత్మికుని సామాజిక పాత్రను పటిష్ఠపరిచినప్పుడు మాత్రమే సుపరిపాలన సాధ్యమవుతుందని హిందూ సంప్రదాయం ఘోషిస్తుంది. ఆధ్యాత్మికుల సామాజిక బాధ్యత భావనపై హిందూ పాలనా వ్యవస్థ ఆధారపడి ఉన్నది. ఈ బాధ్యత వారిని, పాలకుల అవివేకాన్ని ప్రశ్నించేందుకు, ఎదిరించేందుకు పురిగొల్పుతుంది.

హిందూ మతం భౌతిక ప్రపంచ ఉనికిని నిరాకరించినప్పుడు ఆ పాలనా వ్యవస్థ కూలిపోయింది. భౌతిక జగత్తు మిథ్య అనే భావాన్ని ఆదిశంకరాచార్యులు ప్రవచించారు. ఈ భావన పర్యవసానంగా భౌతిక ప్రపంచం నిజం కానప్పుడు సాధువు, పాలకుడిని ఎదిరించవలసిన అవసరం లేదనే విశ్వాసం ప్రబలిపోయింది. భౌతికప్రపంచమే ఉనికిలో లేనప్పుడు అవివేక పాలకులను ఎదిరించవలసిన అవసరం సాధువుకు లేదు. తన వ్యక్తిగత మోక్షానికి మాత్రమే ఆ పుణ్య పురుషుడు ఆరాటపడడం ప్రారంభమయింది. ఇది, క్షత్రియులను నియంత్రించడమనే తమ సామాజిక పాత్రను బ్రాహ్మణులు పూర్తిగా త్యజించడానికి దారితీసింది. క్షత్రియులు లేదా నిరంకుశ పాలకులు ప్రజలను ఎంతగా వేధిస్తేనేమి? అసలు పాలకులు, ప్రజలు ఇరువురూ మిథ్యలే కదా! మరి తులసీదాస్, కబీర్ ప్రబోధాలు ప్రజలను నిరంకుశ పాలనను ఎదిరించడానికి కాకుండా భగవంతుడిని ఆరాధించడం వైపు నడిపించాయంటే ఆశ్చర్యమేముంది?

వర్తమాన హిందూ సాధువులు ఈ తప్పుడు సంప్రదాయాన్నే అనుసరిస్తున్నారు. నేషనల్ డెమోక్రాటిక్ అలయెన్స్ (ఎన్డీఏ) తన నిరంకుశ విధానాలతో ప్రజలను ఇక్కట్ల పాలు చేసింది. పెద్ద విలువ గల కరెన్సీ నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్టీ)తో ప్రజలకు పలు సమస్యలను సృష్టించింది. వస్తు సేవల పన్ను మూలంగా లక్షలాది చిన్న, మధ్యతరహా, సూక్ష్మ పరిశ్రమలు ఖాయిలా పడ్డాయి. అసంఖ్యాక కార్మికులు జీవనాధారాన్ని కోల్పోయారు. కంపెనీలు దివాలా తీయడంతో ఆత్మహత్య చేసుకున్న యజమానులూ పెద్దసంఖ్యలో ఉన్నారు. తోపుడు బండిపై వివిధ వస్తువులను, వీధుల్లో తిరుగుతూ విక్రయించుకునేవారు లేదా ఫుట్‌పాత్‌లపైన బండ్లను పెట్టుకొని వివిధ తినుబండారాలను అమ్ముకొనేవారు జీవనోపాధిని కోల్పోయారని, ఫలితంగా వారు తమ గ్రామాలకు తిరిగి వెళ్లిపోయారని ముంబైలో ఒక ట్యాక్సీ డ్రైవర్ ఇటీవల నాకు చెప్పాడు. ఎన్డీఏ ప్రభుత్వం గంగానదిని నేషనల్ వాటర్ వే గా తీర్చిదిద్దుతున్నది. తద్వారా ఆ పవిత్ర నదిని సరకులను రవాణా చేసే గాడిదగా మార్చివేసింది! దురదృష్టవశాత్తు ఈ పరిణామాల పట్ల దేశంలోని సాధువులు మౌనంగా ఉండిపోయారు. వారు తమ అనుయాయులను వ్యక్తిగత మోక్షం సాధించే దిశగా నడపడంలోనే నిమగ్నమయ్యారు. ఫలితంగా ఎన్డీఏ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. పాలకుల అవివేకాన్ని ప్రశ్నించడమనే తమ సామాజిక బాధ్యతను సాధువులు లేదా ఆధ్యాత్మికవేత్తలు తమకు తామే పూర్తిగా త్యజించటం వల్లే ఈ శోచనీయ పరిస్థితులు నెలకొన్నాయని చెప్పక తప్పదు.

యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ (యూపీఏ) పాలన కించిత్ మెరుగు. ధర్మవిరుద్ధ పాలనను ఉపేక్షించవచ్చనే సూత్రాన్ని జీసస్ ప్రవచించారు. ఒక దశలో సీజర్ యూదుల పట్ల నిరంకుశంగా వ్యవహరించసాగాడు. మరి సీజర్‌కు పన్నులు చెల్లించడం సరైన విషయమేనా అని జీసస్‌ను అడిగారు. 'సీజర్‌కు ఇవ్వాల్సినవి సీజర్‌కు ఇవ్వండి, భగవంతునికి ఇవ్వాల్సినవి భగవంతునికి ఇవ్వండి' అని జీసస్ సమాధానమిచ్చారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే సీజర్ అధికార ఆభిజాత్యాన్ని జీసస్ అంగీకరించారు. అతని నిరంకుశ పాలనను చూసీచూడనట్లు మిన్నకుండిపోయారు. సీజర్‌కు పన్నులు చెల్లించడాన్ని ప్రతిఘటించాల్సిన అవసరమేమీ లేదని జీసస్ అభిప్రాయపడ్డారు. అంటే సీజర్ నిరంకుశ పాలన కొనసాగడం పట్ల జీసస్‌కు అభ్యంతరం లేకపోయిందని మనం అర్థం చేసుకోవచ్చు. మరొక సందర్భంలో సీజర్ ప్రతినిధి వేసిన ఒక ప్రశ్నకు సమాధానంగా 'నా రాజ్యం ఈ ప్రపంచానికి సంబంధించినది కాదు' అని జీసస్ అన్నారు. జీసస్ రాజ్యం అలౌకిక ప్రపంచానిది కాగా సీజర్ రాజ్యం ఈ ప్రపంచానిది. రెండూ వేర్వేరు రాజ్యాలు. ఈ ధరిత్రిపై ఉన్న రాజ్యపాలకుని నిరంకుశత్వాన్ని అలౌకిక రాజ్యవాసులు ఎదిరించాల్సిన అవసరమేమీ లేదు. కనుకనే మన్మోహన్‌సింగ్ పలు ప్రజావ్యతిరేక విధానాలను అమలుపరిచారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఉత్పత్తుల విషయంలో పాటిస్తున్న రిజర్వేషన్ల విధానాన్ని రద్దు చేశారు. యంత్రాలపై ఉత్పత్తి చేసే వస్త్రాలపై పన్నును తగ్గించారు (దీనివల్ల చేనేత రంగం తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేయబడింది). ప్రభుత్వరంగ బ్యాంకులలో పెచ్చరిల్లిపోయిన అవినీతిని అరికట్టకపోగా ఆ నానావిధ అక్రమాల వల్ల బ్యాంకులు దివాలా తీయకుండా ఉండేందుకై వాటికి భారీ నిధులను సమకూర్చారు.

ఎన్డీఏ, యూపీఏ తాత్విక మూలాలలో పలు సాదృశ్యాలు మనకు స్పష్టంగా కనిపిస్తాయి. క్షత్రియుల నిరంకుశత్వాన్ని ప్రతిఘటించాల్సిన అవసరం లేదని హిందూ బ్రాహ్మణులు భావించారు. సీజర్ నియంతృత్వాన్ని ఎదిరించాల్సిన అవసరం లేదని క్రైస్తవులు భావించారు. ఈ భావనల వారసత్వం మూలంగానే నేటి భారతీయ పాలక సంకీర్ణాలు ప్రజా వ్యతిరేక విధానాలను జోరుగా అమలుపరిచాయి. అయితే ఎన్నికలలో విధిగా విజయం సాధించాల్సిన అవసరం రెండింటికీ ఎంతైనా

ఉన్నది. తత్కారణంగానే ఈ రెండు సంకీర్ణ ప్రభుత్వాలు కొన్ని పేదల అనుకూల విధానాలను అమలుపరిచాయి. ఉజ్వల పథకం కింద పేదలకు ఉచిత వంటగ్యాస్‌ను సమకూర్చే సదుపాయాన్ని ఎన్డీఏ కల్పించింది. అలాగే ఆయుష్మాన్‌భారత్ పథకంతో పేదలందరికీ ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం కల్పించింది. యూపీఏ ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలుపరిచింది. రైతుల పంట రుణాలను రద్దుచేసింది. యూపీఏ ప్రభుత్వం అమలుపరిచిన పేదల సంక్షేమ పథకాలతో పోల్చితే ఎన్డీఏ ప్రభుత్వం సర్కార్ చేపట్టిన సంక్షేమ పథకాలు పదే ప్రజలకు పెద్ద లబ్ధిని అధిక మేలును సమకూర్చేవి కావు. మరింత స్పష్టంగా చెప్పాలంటే యూపీఏ పథకాలే పేదలకు నిజమైన సంక్షేమాన్ని అందించాయి. అయితే ఇది ఒక ప్రత్యేక అధ్యయనానికి సంబంధించిన అంశం గనుక దానినలా ఉంచుదాం. ప్రజా వ్యతిరేక ఆర్థిక వ్యవస్థను సృష్టించడం, ఏవో కొన్ని సంక్షేమ పథకాలతో పేదలను సంతృప్తిపరచడమే రెండు ప్రభుత్వవిధానాలలోని ఉమ్మడి అంశం అని మనం గుర్తించి తీరాలి.

ఈ నేపథ్యంలో, ఎన్నికల అనంతరం అధికారంలోకి రాబోయే కొత్త ప్రభుత్వం విధిగా ఈ క్రింద సూచించిన చర్యలను చేపట్టాలి. ఒకటి– జీఎస్టీ చెల్లింపు విధానాన్ని సరళీకరించాలి. చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలు తమ సమయాన్ని జీఎస్టీ చెల్లింపు పద్ధతికే కేటాయించవలసిన అవసరం లేకుండా చేయాలి. తమ వ్యాపారంపై పూర్తి శ్రద్ధ చూపించేందుకు ఆ వ్యాపార సంస్థలకు ప్రభుత్వం తోడ్పడాలి. రెండు– ప్రజాపంపిణీ వ్యవస్థ, రైతులకు విద్యుత్ సబ్సిడీలు, ప్రభుత్వ నిధులతో అమలవుతోన్న విద్య, వైద్య సదుపాయాల కల్పన పథకాలు మొదలైన వాటన్నింటినీ రద్దు చేయాలి. తద్వారా ఆదా అయిన సొమ్ముని దేశ పౌరులందరికీ కనీస ఆదాయాన్ని సమకూర్చేందుకు ఉపయోగించాలి. మూడు, దేశ పౌరుల సగటు ఆదాయం ప్రభుత్వోద్యోగుల సగటు ఆదాయంతో సమానమయ్యేంత వరకు ప్రభుత్వోద్యోగుల వేతన భత్యాలు, పెన్షన్ల పెరుగుదలను స్తంభింపచేయాలి. నాలుగు, వ్యూహాత్మక ప్రాధాన్యంగల ప్రభుత్వ రంగ సంస్థలను మినహా ప్రభుత్వ రంగ బ్యాంకులు, కంపెనీలు అన్నిటినీ ప్రైవేటీకరించాలి. భారత్‌ను గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా రూపొందించాలి. ఎన్డీఏ, యూపీఏలు ఈ విధానాలకు నిబద్ధమయ్యేంత వరకు ఓటర్లు వాటికి ప్రత్యామ్నాయంగా నోటాను వినియోగించుకోవడం మంచిది. ❍

*(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)*

# భరత్ ఝున్‌ఝున్‌వాలా గారి వ్యాసంపై లోక్‌సత్తా టైమ్స్ బృందం స్పందన



‘సామాజిక’ భ్రష్టత్వం ఈ దేశ దౌర్భాగ్యం’ పేరుతో భరత్ ఝున్ ఝున్‌వాలా గారు పై వ్యాసం (రచయిత ఆంగ్లంలో రాసిన వ్యాసానికి తెలుగు స్వేచ్ఛానువాదం)లో లేవనెత్తిన కొన్ని సమస్యలు ఆలోచించదగ్గవి. అయితే ఆయన చేసిన మౌలిక విశ్లేషణని ప్రజాస్వామ్యవాదులు, హేతువాదులు, మానవవాదులు అంగీకరించటం సాధ్యం కాదు.


ఆధునిక యుగం వచ్చినా ఇంకా మతగురువులకో, సాధువులకో లోబడి రాజ్యాధికారం పనిచేయాలని రచయిత అనటం అసంబద్ధమైనది. మధ్య యుగాలలో ఐరోపా దేశాలలో పోప్‌కుఅధికారం నెరపటం, ప్రాచీన కాలం నుంచి మనదేశంలో రాజులు మతగురువులకు లోబడి పనిచేయటం ఉన్నాయి. కానీ ఆనాడు ఊహకు కూడా అందనిరీతిలో ఈ ఆధునికయుగంలో మూడు విషయాల్లో అద్భుత ప్రగతి సాధ్యమైంది. అంతరాలు లేని సమాజం, మానవ విలువల చుట్టూ నిర్మాణం, అందరికీ అందుబాటులో ఉండే అద్భుత ప్రగతి.. ఆధునిక యుగ నిర్వచనాలుగా మారాయి.

ప్రతి వ్యక్తీ తన సంతోషం, సంతృప్తి వెతుక్కునే అవకాశం గతంలో ఎన్నడూ లేనంతగా ఈ కాలంలో ఉంది. పెద్ద–చిన్న, సామాన్యుడు–సంపన్నుడు, ఆడ–మగ తదితర తేడాలు లేకుండా అందరికీ తమ భవిష్యత్తును నిర్దేశించుకునే అవకాశాలు లభ్యమయ్యాయి. కాబట్టి ఈవేళ సమాజం సాధువుల చేతుల్లో ఉండాలనటం ఏ రకంగానూ ఆమోద యోగ్యం కాదు. గతంలో ఉన్న ఉదాత్త భావాలను స్వీకరిస్తూ, అదేసమయంలో అందులోని చెడును తిరస్కరించాలి. అలాకాకుండా గతమంతా ఘనమే అంటే తిరోగమనం అవుతుంది. విద్యని, ఆరోగ్యాన్ని ప్రభుత్వాలు సామాన్యులకు చేయాల్సిన ఇతర పనులను పూర్తిగా విస్మరించి, ప్రజల పన్నుల




డబ్బును పందేరం చేయాలన్న రచయిత భావన అత్యంత ప్రమాదకరమైనది. రాజ్యం ఉన్నది ఉమ్మడి అవసరాలను తీర్చడానికి! ప్రాచీన కాలంలో అవసరాలు జాతి, రాజ్య రక్షణ, రాజ్యం లోపల పౌరుల రక్షణ– దాని చుట్టూనే మొత్తం పాలన ఉండేది. కాలక్రమంలో జాతి, రాజ్య రక్షణతోపాటు ఆర్థిక వృద్ధి, శాస్త్ర విజ్ఞాన విస్తరణ, పారిశ్రామికీకరణ వీటి నేపథ్యంలో మానవజాతి రాజ్యానికి నిర్దిష్టమైన పాత్రని నిర్వచించుకున్నది. కొంతకాలం పాటు వ్యక్తివాద, ఎగుమతుల వర్తకపు క్యాపిటలిజం ఉండాలని కోరిన పాశ్చాత్య దేశాలు ఒకపక్క, రాజ్యమే పూర్తిగా అన్నిటినీ శాసిస్తూ వ్యక్తుల బాగోగుల బాధ్యతను తీసుకునే సోషలిస్టు రాజ్యాలు మరోవైపు– రెండు తరాలపాటు ప్రపంచాన్ని కుదిపేశాయి. ఎట్టకేలకు రెండో ప్రపంచయుద్ధం తర్వాతి పరిణామాల వల్ల.. వ్యక్తి అవసరాల చుట్టూ మార్కెట్‌లో పోటీని పెంచి సామర్థ్యం, ప్రతిభకి పెద్దపీట వేసే ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, పుట్టుకతో వచ్చిన అంతరాలు, అసమానతలు జీవితాల్ని ప్రభావితం చేయకుండా ఆ బిడ్డ శక్తిసామర్థ్యాలు వికసించే రీతిన అవకాశాలు అందించటం కోసం మంచి ప్రమాణాల్లో విద్య, ఆరోగ్యం ఆ కుటుంబాలకు ఆర్థికభారం లేకుండా అందించటం, సమాజంలో ఆర్థిక స్వేచ్ఛ వికసించడం కోసం మౌలిక సదుపాయాల ఏర్పాటు, అందరూ సమానంగా పోటీపడేందుకు సమాజంలో శాంతి, సుహృద్భావం నిలిపేందుకు చట్టబద్ధపాలన, అంటే చట్టం అందరికీ సమానంగా వర్తించడం.. ఇవి ఆధునిక రాజ్యంలో వ్యక్తి సుఖానికి, సమాజ హితానికి, మానవ ప్రగతికి, ప్రతి వ్యక్తికీ ఎదిగే అవకాశాలనివ్వడానికీ ప్రాతిపదికలుగా ఆధునిక ప్రపంచం గుర్తించింది. ఏ రాజ్యమైనా ఈ బాధ్యతల్ని విస్మరించి కేవలం ఉద్యోగులకు జీతభత్యాల్ని, ప్రజలకు తాయిలాల్ని పంచటం, అధికార కాంక్షతో కోట్లు ఖర్చు పెట్టి ఓట్లు పొందేందుకు పెడుతున్న పెట్టుబడి డబ్బుకి పదింతలు ఎడాపెడా అధికారాన్ని అడ్డుపెట్టుకుని సంపాదించటం.. ఇవే రాజ్యం పనులైతే ఆ సమాజం నిలబడదు. కాబట్టి ప్రభుత్వం ఏం పనులు చేయాలో సూచించకుండా, చెప్పకుండా, వాటన్నిటినీ వదిలి డబ్బులు పందేరం చేయటమే ప్రభుత్వాల బాధ్యత అంటే పుట్టుకతో అసమానతలు, కులవ్యవస్థ, అవకాశాలలేమి వల్ల వచ్చే బానిసత్వం మరింతగా పెరిగిపోతాయి తప్ప ఆధునిక సమాజానికి దారితీయవు.

మరోవైపు, మనం మతాన్ని తిరస్కరించటమో, ద్వేషించటమో పొరపాటు. ప్రాచీనకాలంలో మతం కార్యకారణ సంబంధం అర్థంకాని మానవుడికి ప్రకృతిలో జరిగే ఎన్నో ప్రక్రియలకి కారణాలు చూపే ప్రయత్నం చేసింది. ఉదాహరణకి పిడుగులు పడితే అది అర్జునుడి రథశీల అని ఆరోజుల్లో అనేవారు. ఇలాంటి మూఢనమ్మకాలు ప్రతి కాలంలో, ప్రతి దేశంలో, ప్రతి మతంలో శతాబ్దాలుగా కొనసాగాయి. శాస్త్రీయ పద్ధతులతో నిశితమైన పరిశీలనతో ప్రామాణికమైన ప్రయోగాలతో కార్యకారణ సంబంధం ఉన్నకొద్దీ స్పష్టంగా మానవజాతికి గోచరిస్తున్నది. అప్పుడు అంధ విశ్వాసాలను తిరస్కరించటం తప్ప మానవజాతికి మరో మార్గమే లేదు. అయితే మతం మరో పాత్రను కూడా పోషించింది. అది వ్యక్తికి–సమాజానికి ఉన్న సంబంధాన్ని నిర్వచించటం! సమాజహితం కోసం, శాంతి సుహృద్భావాల కోసం వ్యక్తి ప్రవర్తనని కట్టడి చేయడానికి దైవాన్ని, అతీత శక్తులని, మరణానంతరం జీవితంలో చేసిన పాపపుణ్యాల కారణంగా లభిస్తాయని చెప్పే స్వర్గనరకాలు లేదా పునర్జన్మని.. వీటన్నిటినీ వ్యక్తి ప్రవర్తనను శాసించటానికి ప్రాతిపదికంగా మతం ఉపయోగించింది. అంటే మనిషి నైతిక ప్రవర్తనకి మత విశ్వాసాలను ఆలంబనగా చేశారు. ఆధునిక ప్రపంచంలో మన ముందున్న సవాలు.. భగవంతుని మీద విశ్వాసం ఉన్నా, లేకున్నా ఏ మతాన్ని, మతవిశ్వాసాలను నమ్మినా, నమ్మకున్నా, మతంతో సంబంధం లేకుండా సమాజం అంతటికీ మంచి, చెడు మధ్య తేడాని, మనిషి ప్రవర్తన నైతికంగా ఎందుకుండాలో తగిన కారణాన్ని మనం చూపెట్టి మతానికి అతీతంగా మందిహితం కోసం వ్యక్తి ప్రవర్తనని శాసించడం, నిర్దేశించటం! అందుకు మానవజాతి





ఆధునిక యుగంలో ఉదాత్తమైన మానవ విలువలున్న రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువల్ని, వ్యక్తి స్వేచ్ఛని- మానవ ప్రగతికి అత్యంత కీలకమైన లక్ష్యాలుగా మత విశ్వాసాలకు ప్రత్యామ్నాయంగా కనీసం మతానికి సమానస్థాయిలో ప్రతిష్ఠించుకుంది. అదేసమయంలో ఎంత ప్రగతి సాధించినా సమాజంలో అత్యధికులు మానవాతీత శక్తులని, భగవంతుడిని నమ్మటం, ఆరాధించటం జీవపరిణామంలో భాగమని కొందరు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అందుకు ఆధునిక యుగంలో మానవ సమాజం మత విశ్వాసాల్లో రాజ్యం చోటు చేసుకోకూడదని, అలాగే రాజ్య నిర్వహణను మతవిశ్వాసాలు శాసించకూడదని, అలాగే మత విశ్వాసాల పేరుతో మానవ హక్కుల్ని, వ్యక్తి స్వేచ్ఛను హరించకూడదని నిర్ధారణకు వచ్చింది. ఈవేళ మళ్లీ ఊహాజనిత గత వైభవాల్ని స్మరిస్తూ మతాన్ని, మతగురువుల్ని రాజ్య నిర్వహణలో జోక్యం చేసుకుని రాజ్యాన్ని శాసించే అధికారాన్ని పొందాలని కోరుకోవటం తిరోగమనమే తప్ప పురోగమనం అవదు.

కానీ భారతదేశం ఇంకా రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య లక్ష్యాన్ని సాధించటంలో, మతాన్ని ఆధునిక రాజకీయ అవకాశాలు, అవసరాలకనుగుణంగా ఆధునీకరించే విషయంలో విఫలమైంది. మత విశ్వాసాల్ని, ఆధ్యాత్మికతను వేరు చేయలేకపోయింది. రచయిత ప్రస్తావించిన జీసస్‌ను ఆరాధించే పలు అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా మతవిశ్వాసాలు ఇంకా బలంగానే కొనసాగుతున్నా.. అవి రాజకీయాలు, పాలనలో సంస్కరణలకు ప్రతిబంధకాలు కాలేదు. కానీ భారతదేశంలో రాజ్యాంగానికి – సమాజానికి మధ్య ఉన్న అగాధాన్ని పూరించే ప్రయత్నం పకడ్బందీగా జరగలేదు. ఇది మన వైపు నుంచి అతి పెద్ద వైఫల్యం! స్వార్థ రాజకీయ నాయకులు ప్రజల్లోని మూఢత్వాన్ని, పేదరికాన్ని, అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని రాజ్యాంగాన్ని తుంగలో తొక్కటాన్ని చూస్తున్నాం. బోధనారంగం నుంచి వచ్చిన భరత్ ఝున్‌ఝున్‌వాలా లాంటి ఆర్థికవేత్త కూడా ఈ అంశాల్ని గమనంలోకి తీసుకోకుండా పాత రాజకీయ నాయకుల తరహా పరిష్కారాలు చెప్పటం నిరుత్సాహం కలిగిస్తుంది.

అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యాలను అందుబాటులోకి తేవటం, అధికారాన్ని వికేంద్రీకరించి ప్రజలందరికీ స్థానిక పాలనను అందుబాటులోకి తేవటం, చట్టబద్ధపాలన, దామాషా ఎన్నికల పద్ధతి వంటి మార్పుల్ని తేవటం ద్వారా రాజ్యాంగానికి, సమాజానికి మధ్య అంతరాన్ని తొలగించే ప్రయత్నం చేయకుండా.. విద్య, ఆరోగ్యం బాధ్యతల నుంచి ప్రభుత్వాన్ని తప్పించి నగదు పంపిణీ పథకాల్ని అమలు చేయటమంటే– మానవ వనరుల అభివృద్ధితో కాకుండా కేవలం యంత్రాలు, కృత్రిమ మేధతో కూడిన గ్లోబల్ నాలెడ్జ్ మార్కెట్‌గా మిగిలిపోతుంది. యువభారత్ ఈసురోమంటూ కొత్త సమస్యగా మారుతుంది.

ఒక్కమాటను మాత్రం భరత్ ఝున్‌ఝున్‌వాలా బాగా గుర్తించారు, నిర్మొహమాటంగా చెప్పారు. గత వ్యాసాలలో కూడా ఆయన ఈ మాటల్ని చెప్పారు. భారత ప్రజాస్వామ్య సంక్షోభానికి మూలం ప్రాథమికంగా ప్రభుత్వ కార్యాలయాల్లో ఉంది.. అని వారు చెప్పింది వాస్తవం! ప్రభుత్వోద్యోగులకు మితిమీరిన జీతభత్యాలిచ్చి 90 శాతం ప్రజలకంటే చాలా ఉన్నత స్థితిలో నిలిపి ప్రజల్ని యాచకులుగా చేయటం వల్ల ఎన్నికల వ్యవస్థ కూడా భ్రష్టుపడుతోంది. వీటికి పరిష్కారం హక్కుగా పౌర సేవల చట్టం నుంచి ప్రతి ఓటుకూ విలువ ఉండే దామాషా ఎన్నికల వ్యవస్థ దాకా ఉన్నాయి. ఇవన్నీ ఆచరణసాధ్యమైనవి. 'నోటా' అనేది ఒక హెచ్చరికే తప్ప పరిష్కారం కాదు. మతాన్ని కూడా ఈ పరిష్కారాల దిశగా ఆధునీకరించి వ్యక్తిగత విశ్వాసాల పరిధిలోకి తెస్తే మన దేశంలో మార్పునకు పూర్తిస్థాయి పటిష్ఠ పునాది ఏర్పడుతుంది. అప్పుడు మతాలు నిజమైన 'ఆధ్యాత్మికత'కు (మత విశ్వాసాన్ని, ఆధ్యాత్మికతను రచయిత ఒకే గాటన కట్టకుండా ఉండాల్సింది) నిలయాలుగా మారతాయి.

అత్యధిక శాతం ప్రజలకు వికాసం లేకుండా యధాతథ స్థితిని కొనసాగించేందుకు కాకుండా.. అందరికీ ఎదిగే అవకాశాలను అందించే రాజ్యాంగ ప్రజాస్వామ్య ఎజెండాపై ప్రజలను చైతన్యపరిచేందుకు భరత్ ఝున్‌ఝున్‌వాలా లాంటి మేధావులు తమ శక్తిసామర్థ్యాలను ఉపయోగించాలని మా ఆశ, వినమ్రతతో కూడిన విజ్ఞప్తి! ❍

# దొంగెవడ్రా!

- వేగోకృప



ప్రతీకాత్మక చిత్రం

**కో**ర్ట్ కాంప్లెక్స్ చెట్ల కింద రాత్రి తొమ్మిది తొమ్మిదిన్నరకింకా వెళ్ళిపోకుండా మిగిలిపోయుండే ఒకే బండి నాదే. పగలు తొమ్మిది తొమ్మిదిన్నర నుండి పన్నెండు గంటలసేపు రోజూ నాకోసం ఎదురు చూస్తూ నించునుండడమే దాని పని. సాయంత్రం ఆరు తరవాత సాధారణంగా నిర్మానుష్యం అయిపోతుంది ఈ ప్రాంతం. సివిల్ కోర్టులు, క్రిమినల్ కోర్టులు, స్మాల్ కాసస్ కోర్టులు సుమారు ఏభై దాకా ఉన్న ఈ కోర్ట్ కాంప్లెక్స్ పగటి పూట జనంతో కిటకిటలాడుతూంటుంది. కోర్టునానుకుని దగ్గరగా అర కిలోమీటర్ పొడవున్న మెయిన్‌రోడ్డు మీద నుంచి కోర్ట్ లోపలికి వచ్చిపోయే వాహనాలతో కోర్టు ప్రాంగణంలో ఆపి ఉన్న వాహనాలతో నడవడానికి కూడా చోటుండదు. రోడ్డుకి అవతలవైపు ఉన్న సందులు వన్ వేలతో, హోల్‌సేల్ మార్కెట్లకి వచ్చిపోయే తోపుడు బళ్ళతో ఎప్పుడూ ట్రాఫిక్ జామ్‌లతో నిండిపోయుంటాయి. ఆ సందులలోని రెండు మూడు అంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్‌లన్నింటిలోనూ అడ్వొకేట్ల ఆఫీసులే ఉంటాయి. కోర్ట్ కాంప్లెక్స్‌లో ఉన్న అడ్వొకేట్స్‌కి ఈ కమర్షియల్ కాంప్లెక్స్‌లే దిక్కు. అలాంటి ఇరుకు సందులో రెండో అంతస్తులో గాలీ వెలుతురు ధారాళంగా ఉండే ఆఫీసు ఒకటి కోర్ట్ పనయేక నా ఛాంబర్ వర్క్ కోసం ఉంది. ఆ సందులన్నీ అడ్వొకేట్లతో కోర్ట్ కేసుల కోసం వచ్చే వారి క్లయింట్లతో ఉదయం నుంచి రాత్రి దాకా కిటకిటలాడుతూంటాయి. కోర్ట్ ఎంట్రన్స్‌లోనే మెయిన్ గేటు ఒకవేపు పోలీస్ స్టేషన్, మరోవేపు ఫైర్‌స్టేషన్ ఉన్నాయి.

ఈ జనం మధ్య ట్రాఫిక్ జామ్‌లలో సులభంగా తిరగడానికి ఇప్పటికీ టూ వీలరే సుఖం. ఒకప్పుడు బజాజ్ చేతక్.. అప్పుడు కారు బరువు మోయలేక. ఇప్పుడు హోండా ఏక్టివా.. జనం గోల తట్టుకోలేక. మధ్యలో కొంతకాలం హీరోహోండా స్ప్లెండర్ ప్లస్.. పెట్రోల్ కన్సర్వేషన్ కోసం. బండి సేఫ్టీ దృష్ట్యా మెయిన్ రోడ్ ఎదురు సందులలో ఆఫీసుకి దగ్గరగా పార్కింగ్‌కు అవకాశం తక్కువ. కోర్ట్ కాంప్లెక్స్‌లో మంచి నీడనిచ్చే రెయిన్ ట్రీస్– నిద్రగన్నేరు చెట్లున్నాయి.

ఓ చెట్టు కింద నా బండి తప్ప మరే బండీ నిలపడానికి వీల్లేకుండా చాలా కాలంగా పరిచయం ఉన్న స్టాంప్ వెండర్ రవి నాకోసం అక్కడే కూర్చునుంటాడు పొద్దున్నుంచి సాయంత్రం దాకా. నా బండి ఎండకు ఎండదు, వానకి తడవదు.. అని అనలేం. వర్షం పడుతున్నప్పుడు తడవకపోయినా తగ్గేక ఆకుల మీంచి పడ్డ నీళ్ళతో బండి మీది దుమ్ము వదిలిపోతుంది.

సాధారణంగా తొమ్మిదికల్లా పని ముగించుకుని ఇంటికి బయల్దేరడం అలవాటు. ఇవాళ ఈ అగ్రిమెంట్ పని అంత త్వరగా తెమిలేలా లేదు. రాజుగారి కొత్త ప్రాజెక్ట్‌లో మూడు ఫ్లాట్లు రాజాగారు తీసుకుంటున్నారు. ఇద్దరికీ కావలసినవాడిని కావడంతో వాళ్ళడిగిన మార్పులు చేర్పులు ఎంతవరకు అవసరమో చూసుకుంటూ ఇద్దరికీ సంతృప్తికరంగా అగ్రిమెంట్ తయారయేటప్పటికే తొమ్మిదిన్నరయింది. మూడు అగ్రిమెంట్ల ప్రింటవుట్లు తీసి రాజుగారి కొడుకుల సంతకాల కోసం పక్కసందులో వారి ఆఫీసుకి పంపించాక చూస్తే ప్రింటర్స్ డెవిల్. మూడింటి మొత్తం సేల్ కన్సిడరేషన్ ఎమౌంట్ మూడింటిలోను ప్రింటయిపోయుంది. మళ్ళీ ఆ పేజీలు కరెక్ట్ చేసి ప్రింటవుట్లు తీసి పంపించి వాళ్ళ సంతకాలయేక నా చేతికి వచ్చేనరికి పావుతక్కువ పదకొండయింది.

ఆఫీసుకి తాళం వేసి బయటి లైటార్పేక చూస్తే చిమ్మచీకటి. యాభై అరవై ఏళ్ళ వయసు పైబడ్డ ఈ కట్టడాల్లో మెయిన్‌టెనెన్స్ గురించి పట్టించుకునే వాళ్ళెవరూ ఉండరు. కిటికీల అద్దాలు ఎప్పుడో వగిలిపోయి ఫ్రేమ్‌లు వేళ్ళాడుతుంటాయి. ఈ బిల్డింగ్‌లకి వేసిన సున్నం మొదటి సంవత్సరం వర్షాలకే పోయుంటుంది. ఆ తరవాత దానవసరం ఎవరికీ పట్టలేదు. సంవత్సరాల తరబడి వర్షాలకు పట్టిన పాకుడు ఎండి పొరలు పొరలుగా బయట గోడల మీద వేళ్ళాడుతూ సిమెంట్ పెచ్చులూడిపోతూ లోపలి ఇటుకలు బయటపడుతూంటాయి. ఇంతకీ మా ఆఫీసున్న బిల్డింగ్ పేరు కుబేర్ బిల్డింగ్స్. మొదట్లో ఎవరో ఇంగ్లీషువాడు క్యూబర్ అనుకునేవాడిని స్పెల్లింగ్ చూసి. Kuber Buildings.

కోర్ట్ కాంప్లెక్స్ ఎంట్రన్స్‌కి గేటు లేదు. మెయిన్ రోడ్డు మీద నుంచి బయల్దేరే ఆఖరి బస్సు వెళ్ళిపోయి అప్పుడే గంటయుంటుంది. పోలీస్ స్టేషన్‌లో, ఫైర్ స్టేషన్‌లో లైట్‌లు వెలుగుతున్నాయి. అక్కడ నుంచి రెండుమూడు వందల మీటర్ల దూరంలో కోర్ట్ బిల్డింగులు చీకట్లో నిలబడున్నాయి.

చెట్టుకింద నా బండొక్కటే నిలబడిపోయుంది. నరమానవులెవరూ చుట్టుపక్కల్లేరు.

సీటు కింద హెల్మెట్ తీసి రెండు ఒరిజినల్ అగ్రిమెంట్లు న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేపర్ మధ్య పెట్టి మడతపెట్టి సీట్ కింద దాచాను. రేపు మొదటిపనిగా రాజుగారి సంతకాల కోసం ఉదయం పంపించాలి.

గంట ప్రయాణం ఇంటికి.

పది నిమిషాల్లోనే నేను చేసిన తప్పు తెలిసొచ్చింది. అబ్బే అగ్రిమెంట్ విషయం కాదు.

కోర్టు ప్రాంగణం బయటికొచ్చి మెయిన్ రోడ్డు దగ్గర ఎడమవేపుకి తిరిగేక అరకిలోమీటరు దూరం వచ్చేక బండి లైటు వెలుగులో కనిపించాడు ఓ కానిస్టేబుల్ లిఫ్ట్ కోసం చెయ్యూపుతూ. పోలీసు స్టేషన్ నుంచి ఇంటికి వెళుతున్నట్టున్నాడు.

రైల్వేస్టేషన్ వేపు వెళుతున్నారా సార్, కొంచెం అక్కడి దాకా...

నిజానికి హోల్‌సేల్ మార్కెట్ వేపు నుంచే ఇంటికెళతాను. చీకటి, జనం ఉండరని రైల్వేస్టేషన్ దారి వేపుకి తిరిగేను. స్టేషన్ దగ్గర దింపి వెళితే పోయిందేంలేదు కదాని ఎక్కమన్నట్టు తలూపాను.

రెండు నిమిషాల్లోనే జంధ్యాలగారి మార్క్ డైలమాలో పడ్డాను.

నేనేల హోల్‌సేల్ మార్కెట్ దారిన పోక ఇటు రావలె. వచ్చితినిపో వీడేల నాకంట పడవలె. పడితే పడెనుపో నేనేల ఆగవలె. నన్నేల లిఫ్ట్ అడగవలె. అంతా నా ఖర్మ.

వీడు దొంగపోలీసు.

అదేంటో నాకన్నీ తెలిసిపోతాయి.

మరే... జేబులోంచి పర్స్ లాగేస్తే, అన్నీ అలాగే తెలిసిపోతాయి. ఒకసారి బస్సు ఫుట్ బోర్డ్ మీద జనం మధ్య వేలాడుతున్నప్పుడు ఒకడిలాగే జేబులో చెయ్యి పెడితే ఈ జేబులో దువ్వెనుందిరా అని చెప్పేను. అదొక ఆర్ట్. జేబులు కొట్టేస్తుంటే తెలుసుకోడం. కావాలని డిస్ట్రేక్ట్ చేస్తూ ఓవరాక్షన్ చేస్తూంటే ఏదో జరుగుతోందనే అర్థం. మొహం మీద నుంచి మెడ కింద నుంచి పైనున్న రాడ్ పట్టుకోడం కోసం ప్రయత్నిస్తూ మరోపక్క జేబులు సవరిస్తుంటే నెక్స్ట్ స్టాప్ లోపల పర్స్ పోడం ఖాయం. స్టాప్ రాకముందే రన్నింగ్‌లో దిగిపోతారు కనుక.

స్టేషన్‌కింకా చాలా దూరం ఉంది. జనసంచారం లేదు. ఏం చెయ్యడం ఇప్పుడు. బండాపి అడిగితే ఏం జరుగుతుంది? ఏదైనా జరుగుతుంది. వాడి దగ్గర కత్తో మరోటో ఉండొచ్చు. వాడు పరిగెత్తొచ్చు. బండి మీద వెంటబెట్టి వాణ్ణి కొట్టి– అంత లేదు, సినిమా కాదుగా. వాడే నన్ను కొట్టి బండి కూడా లాక్కుపోతే.

ఏం చెయ్యడం? ఏం చెయ్యడం??

స్టేషన్ కిలోమీటర్ దూరంలో ఉంది. ఏం చేసినా స్టేషన్ దగ్గరే చెయ్యాలి. అక్కడా జనం లేకపోతే. ఏం జరగనట్టారుకుండిపోవల్సిందేనా? పర్సులో డబ్బులెక్కువ లేవు. రెండువేల నోటు పర్సులోనే ఉన్నట్టుంది. చచ్చాం. అంతకన్నా ముఖ్యం కొన్ని కాయితాలు, ఏటీఎమ్ కార్డ్స్ ఉన్నాయి.

హమ్మ బతికాను. కాగల కార్యం గంధర్వులే చేశారు.

డ్రంకన్ డ్రైవ్ చెక్ చేస్తున్నారు బళ్ళు ఆపి. రెండు ఎస్‌యూవీలు, రెండు మోటార్ బైక్‌లు ఉన్నాయి చెక్‌పోస్ట్ దగ్గర. ఆపమనకపోయినా ఆపకుండే వెళ్ళే ఉద్దేశం నాకు లేదు. ఇద్దరు ముగ్గురు వీడియో కెమేరాలతో కవర్ చేస్తున్నారు. న్యూస్ ఛానల్ కవరేజ్‌కి పోలీస్ అఫీషియల్ కవరేజ్‌కి.

ఆహా మరింకేం. మునిరత్నం ఉన్నాడు. కోర్ట్ కాంప్లెక్స్‌లోని పోలీస్ స్టేషన్‌లో అతనితో పరిచయం అయినప్పుడు అతను ఎస్.ఐ. ఇప్పుడు సర్కిల్. ఏసీపీ ఆఫీసుకి అటాచ్ అయిన స్టేషన్‌లో ఉంటాడు. చాలా సిన్సియర్. నాలాగే.

బండి పక్కన ఆపి అతని దగ్గరికి నడిచేను. దొంగపోలీసు బండి దగ్గరే నుంచునున్నాడు. ఇటు చూడ్డం లేదు.

హలో సార్, బాగా లేటయినట్టుంది అని.. వస్తున్నా ఆగమన్నట్టు చెయ్యిచూపించాడు మునిరత్నం.

పక్కనున్నవాళ్ళకేదో చెప్పి వచ్చాడు.

డ్రంకన్ డ్రైవా?

కాదు సార్... ఎలక్షన్ కదా. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలవుతోంది. అదిగో ఆ పక్కనున్న కార్లో పాతిక లక్షలు దొరికాయి. ప్రస్తుతానికి కాన్ఫిస్కేట్ చేశాం. తరవాత జరగవలసినది జరుగుతుంది. దొంగపోలీసుకనుమానం రాకుండా చెప్పవలసిన విషయం చెప్పేను.

దొంగపోలీసుని దగ్గరకు రమ్మని చెయ్యూపాడు మునిరత్నం. పారిపోతాడేమోననుకున్నాను.

దగ్గరకొచ్చాడు.

ఐ.డి తియ్యి.

హూ... తీస్తున్నాడు.

కానీ ముందు బయటకొచ్చింది నా పర్స్.

మళ్ళా లోపలికి పెట్టబోతుండగా తియ్ ముందు తీసియ్యి అని మునిరత్నం గట్టిగా అరిచేసరికి కెమేరా వాళ్ళ దృష్టి ఇక్కడికి మారింది. దగ్గరకొచ్చి కవర్ చేయడం ప్రారంభించేరు.

దొంగపోలీసు మరో దారిలేక అన్నీ బయటపెట్టాడు. వాడి ఐ.డితో సహా.

వాడూ పోలీసే. దొంగపోలీసు కాదు. పోలీసు దొంగ.

........

కథ ముగిసిందనుకున్నారా?

దాన్తోనే కథ ముగిస్తే గరికపాటిగారు చెప్పే జ్ఞానం అజ్ఞానం తేడా ఎలా తెలుస్తుంది? సామాజిక జ్ఞానం సామాజిక అజ్ఞానం. ఆధ్యాత్మికం కాదు.

తెల్లారేక న్యూస్ ఛానల్స్‌వారు రాత్రి జరిగిన చేను మేసిన కంచె వార్తని జనానికందరికి శక్తివంచన లేకుండా తినిపిస్తున్నారు. నిశ్శబ్దంగా మాట్లాడుతున్న నా మొహాన్ని కూడా మధ్యమధ్య చూపిస్తూ. వాయిస్ ఓవర్‌లో మధురకంఠం మాటిమాటికి "ప్రభుత్వం", "ప్రభుత్వం" అంటోంది.

రాత్రి ఇలాకాక మరోలా జరిగుంటే. అంటే పోలీస్ చెక్‌పోస్ట్ లేకపోయుంటే...!

నేను పోయిన పర్స్ గురించి పట్టించుకునేవాణ్ణికానేమో. దొంగ నా కళ్ళెదురుగానే ఉన్నా.

ఒకవేళ రైల్వేస్టేషన్ దగ్గర కాలం కలిసొచ్చి జనం ఉండి ఉంటే పరిస్థితేమోగానీ లేకపోతే ఏటీఎమ్ కార్డులు బ్లాక్ చేయించడం కొత్త ఏటీఎమ్ కార్డుల కోసం అప్లయ్ చెయ్యడం, దాని కోసం ఉదయాన్నే బ్యాంక్‌కి పరిగెత్తడం లాంటివి చెయ్యాల్సి వచ్చేది. కానీ అంతకన్నా ముఖ్యమైనది పర్స్‌లోని కాయితాలు.

రాత్రి జరిగింది నా ప్రొఫెషనలిజంకి టెస్ట్.

దొంగపోలీస్ అదే పోలీసుదొంగ అడ్డం పడకపోయుంటే– ఈ ట్రాన్సాక్షన్‌కి సంబంధించి బ్లాక్, వైట్ అమౌంట్స్ కాలిక్యులేషన్స్ ఉన్న కాగితాలు బయటపడితే...? సంతకాలు పూర్తికాని అగ్రిమెంట్లు, లెక్కలున్న కాయితాలు పెద్ద ఇబ్బంది పెట్టవు. కానీ ఆ సమయం నా ఒంటి మీద మూడు అగ్రిమెంట్లకి ఒక్కొక్కదానికి రెండు లక్షల చొప్పున మూడు రెండువేల కట్టలున్నాయి. అది

ఒక్కొక్క అగ్రిమెంట్‌లోని కేష్ కాంపొనెంట్‌లో ఐదో వంతు. అంటే ప్రతి అగ్రిమెంట్‌లోనూ అంత సొమ్ము-కేష్-మరో నాలుగు భాగాలు చేతికొచ్చేకే రిజిస్ట్రేషన్. కేష్‌కి సమానంగా ఉన్న వైట్ పోర్షన్, దానికి తగిన స్టాంప్ డ్యూటీ రాజాగారు కట్టేకే.

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లో కట్టల పాముల కోసమే వెతుకుతుంటారు. హోండా ఆక్టివా సీటు కింద న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో నేను అగ్రిమెంట్ కాయితాలు మాత్రమే జాగ్రత్తగా పెట్టేను. కట్టల పాములని కాదు. అవి నా ఒంటి మీద జాగ్రత్తగానే ఉన్నాయి.

డీమానిటైజేషన్ (పెద్ద నోట్ల రద్దు)లో వెయ్యి నోటు రెండు వేల నోటుగా మారాక నల్లధనం రంగు మారిందే తప్ప, నల్లధనాన్ని పెంచి పోషించే దొంగలూ మారలేదు దొంగబుద్ధులూ మారలేదు. ఆ దొంగలు ముసుగేసుకుని రాత్రిళ్ళు కన్నాలు వేసే రకం కాదు. పట్టపగలు దర్జాగా ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ...మినిస్టర్ల పేషీల్లోనూ... ఇంకా...

అన్నట్టు రెండు తరాలుగా ఫలానా పార్టీకి మా నియోజకవర్గం నుంచి ఎంపిగా ఎన్నికవుతున్నది రాజాగారి కుటుంబం. మూడో తరానికి ముగ్గురు వారసులు తయారుగా ఉన్నారు.

లాంగ్ లివ్ డెమోక్రసీ ... ఐ మీన్ ... ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్

దు ము వులు గొప్పరా దొంగెవడు అనవలెనురా...

వరమగురుడు చెప్పినవాడు పెద్దమనిషి కాదురా... ❍

# ఉచిత ఆదాయంతో మానవ ప్రయత్నాన్నే మానేస్తున్నారు

ఉచిత ఆదాయం పథకం ప్రజల్ని సోమరులుగా తయారుచేస్తోందని ఫిన్లాండ్‌లో జరిపిన ప్రయోగం చెబుతోంది. ఈ వివరాలను అక్కడి ప్రభుత్వం ఇటీవల ప్రచురించింది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఇవి ఆసక్తిని రేకెత్తించాయి.

భారత్‌లో అనేక రాష్ట్రాలు ఇప్పటికే నిరుద్యోగ భృతి పథకాన్ని ప్రకటించాయి. కొన్ని రాష్ట్రాల్లో అమలవుతోంది! ఇక కేంద్రంలో కూడా సార్వత్రిక ఆదాయం పథకంపై ప్రతిపాదనలు నడుస్తున్నాయి. అధికారంలోకొస్తే పేదలకు ఆదాయ పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఎన్నికల హామీ కూడా ఇచ్చారు. ఆటోమేషన్, రోబోటిక్స్ మనిషి ఉద్యోగాలను హరిస్తున్న ప్రస్తుత తరుణంలో యూబీఐ (సార్వత్రిక కనీస ఆదాయం) భద్రత పథకం అవసరమని ఎక్కువమంది నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ఇటలీ కూడా ఈ మధ్యే దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రజలకు నెలకు 780 యూరోల చొప్పున సొమ్ము పంపిణీకి ఏర్పాట్లు చేసింది. బ్రిటన్ కూడా యూనివర్సల్ క్రెడిట్ సిస్టమ్‌ను ప్రారంభించింది. ఈ దశలో ఫిన్లాండ్ – ప్రపంచంలోనే ఓ అడుగు ముందుకేసి – దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించింది. రెండేళ్ల కిందటే దేశంలో సుమారు 2000 మందికి నెలకు 560 యూరోల చొప్పున పంపిణీ చేసింది. వీరంతా 25-58 ఏళ్ల మధ్యవయస్కులు. వీరిలో అత్యధిక లబ్ధిదారులు తమ సమయాన్ని రిలాక్స్ అవడానికే వెచ్చించారు. ఉపాధిని వెతుక్కునే, స్వయం ఉపాధిని ప్రారంభించే ప్రయత్నం వీరు చేయలేదని కెలే అనే సర్వే సంస్థ పరిశీలనలో తేలింది. మొదటి ఏడాది ఫలితాల్ని విశ్లేషించిన కెలే- అవి ఏమంత ఆశాజనకంగా లేవని తేల్చింది. ''ఈ లబ్ధిదారుల గ్రూపును- అదే స్థాయిలో ఉన్న, నెలసరి ఆదాయం ఇవ్వని గ్రూపుతో సరిపోల్చి చూశాం. రెంటి పరిస్థితీ ఒక లానే ఉంది. అంటే ఆర్థిక వనరుల్ని సమకూర్చినా దాన్ని సద్వినియోగం చేసుకుని ఏదో ఒకలా స్థిర పడడానికి లబ్ధిదారులు ప్రయత్నించడం లేదన్న విషయం స్పష్టమయ్యింది. అంటే, ఈ ఉచిత ఆదాయం వారిలోని చొరవను, పనిచేసే తత్వాన్ని హరిస్తోందని ప్రాథమికంగా ఈ డేటాను పరిశీలించినప్పుడు అర్థమైంది" అని హెల్సింకీలోని లేబర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్ రీసెర్చి పరిశోధకులు వెల్లడించారు. అయితే, వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుంటూ, నాణ్యమైన విద్య, ఆరోగ్యం వంటి మౌలిక రంగాలకు కేటాయింపులు తగ్గకుండా, సరైన ప్రోత్సాహకాలతో యూబీఐని అమలు చేస్తే భారత్‌లో సత్ఫలితాలను సాధించవచ్చని కొందరు నిపుణులు అభిప్రాయ పడుతున్నారు.

# ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం!

- డాక్టర్ ఎస్. అనంత్

**ప్రభుత్వ నిర్ణయాలు సమర్థంగా అమలు చేయాలంటే దక్షత గల అధికార గణం అవసరం. ఆర్థిక వ్యవస్థ ఆనుపానులు తెలిసి సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోగల అధికారులను కీలక స్థానాల్లో నియమించాలి. వారికి విస్తృత సైద్ధాంతిక అవగాహన, ఆచరణాత్మక అనుభవం ఉండాలి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వంలో అధికారులు ఏలినవారిని మెప్పించడానికి తమ సమయాన్ని, శక్తియుక్తులను ధారపోశారు. అంతే తప్ప క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావడంపై దృష్టి పెట్టలేదు. మొదటి మూడేళ్లలో కీలక ఆర్థిక సంస్థల నిర్వహణకు విదేశాల నుంచి నిపుణులను రప్పించుకున్నారు. వీరికి తమదైన రంగంలో పట్టు ఉన్న మాట నిజమే. కానీ ఈ దేశ స్థితిగతులు, ప్రజలు, పారిశ్రామికవేత్తల స్వభావం గురించి వారికి ఏమాత్రం అవగాహన లేదు. పెద్దనోట్ల రద్దు సమయంలో వారు ప్రభుత్వానికి సరైన సలహాలు ఇవ్వలేకపోవడానికి కారణమిదే. స్థానిక పరిస్థితుల గురించి పూర్తిగా తెలియకపోవడం వల్ల సరైన దిశానిర్దేశం చేయలేకపోయారు. నీతి ఆయోగ్ తొలి ఉపాధ్యక్షుడు ఆ కోవకే చెందుతారు. రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ సైతం పెద్దనోట్ల రద్దు అమలుకు సరైన సారథ్యం వహించలేకపోయారు. దేశ ఆర్థికవ్యవస్థకు చుక్కాని వంటి రిజర్వుబ్యాంకుకు నాయకత్వం వహించే వ్యక్తికి ఈ దేశ స్థితిగతులతోపాటు ప్రభుత్వం పనిచేసే విధానం గురించి పూర్తిగా తెలిసుండాలి. అప్పుడు మాత్రమే వారు సర్కారుకు సరైన సలహాలు ఇవ్వగలుగుతారు.**



కేంద్ర ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలతో దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. ఉద్దేశాలు ఘనమైనవే అయినా వాటిని పకడ్బందీగా అమలు చేయడానికి సరైన ప్రణాళిక లేక ప్రభుత్వ ఆర్థిక అజెండా చతికిలపడింది. సమూల ఆర్థిక సంస్కరణలు తీసుకొస్తామన్న వాగ్దానాలు కార్యరూపం దాల్చలేకపోయాయి. ఫలితంగా ఆర్థికాభివృద్ధి రేటు మందగించింది. పాత సంస్థలను రద్దు చేసి వాటి స్థానంలో కొత్త సంస్థలను నెలకొల్పడమనేది ఆషామాషీ వ్యవహారం కాదు. ఎంతో పకడ్బందీగా చేయాల్సిన పని అది. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి నీతి ఆయోగ్‌ను నెలకొల్పడాన్ని ఇక్కడ ఉదాహరించాలి. భారత్ వంటి పేద దేశంలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే ముందు ఆచితూచి అడుగేయాలి. అంతే తప్ప ఎంతమాత్రం తొందరపడకూడదు. గడచిన ఏడు దశాబ్దాల్లో మన ప్రభుత్వాలు పాటించిన

**నీతి ఆయోగ్ వైఫల్యం**




ఎన్డీఏ ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే ప్రణాళికా సంఘాన్ని రద్దు చేసి ఆఘమేఘాల మీద నీతి ఆయోగ్‌ను ఏర్పాటు చేశారు. నిజానికి దాని వల్ల దేశానికి ఒరిగిందేమీ లేదు. సహకార సమాఖ్య విధానాన్ని బలపరచడంలో అది విఫలమైంది. కేంద్రం- రాష్ట్రాల హక్కుల్ని కాలరాస్తుంటే మౌన ప్రేక్షకురాలిగా మిగిలిపోయింది. అసలు నీతి ఆయోగ్‌ను నెలకొల్పినదే రాష్ట్రాలకు సాయపడటం కోసం. కౌలుదారు చట్టాలను సవరించేలా భాజపా పాలిత రాష్ట్రాలతో సహా మిగతా రాష్ట్రాలనూ ఒప్పించడంలో ఆయోగ్ విఫలమైంది. 2022కల్లా రైతు ఆదాయాలను రెట్టింపు చేయడం వంటి ఆచరణ సాధ్యంకాని హామీలపై టెలివిజన్ చర్చల్లో పాల్గొనడం తప్ప నీతి ఆయోగ్ సభ్యులు సాధించిందేమీ లేదు.

సూత్రమిదే. గట్టి నిర్ణయాలు తీసుకోవడానికి వెనుకాడబోమన్న తాపత్రయంలో కేంద్ర ప్రభుత్వం దేశాన్ని అనిశ్చిత పంథాల్లోకి నెట్టేసింది. ఒకే ఒక్క అంశంలో మాత్రమే మోదీ సర్కారును అభినందించాలి. అది- 2016లో దివాలా స్మృతి (ఐబీసీ)ని తీసుకురావడం. ఇది మంచి సంస్కరణే కాని, అది సమర్థంగా అమలవడానికి కొంత వ్యవధి పడుతుంది. నీతి ఆయోగ్ ఏర్పాటు, పెద్ద నోట్ల రద్దు, వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) ఆదరాబాదరాగా తీసుకున్న నిర్ణయాలని రుజువైంది. ద్రవ్యలోటు నియంత్రణ గురించి పట్టించుకోకుండా ఎడాపెడా వ్యయం చేయడం, బ్యాంకింగ్, వ్యవసాయ సంక్షోభాల పరిష్కారాలపై శ్రద్ధ పెట్టకపోవడం పాలన వైఫల్యాలకు నిదర్శనలు.

**తొందరపాటు నిర్ణయాలు**

గత ఎన్నికలకు ముందు మోదీపై జనానికి ఆశలు మొలకెత్తాయి. దేశాన్ని ఆర్థిక స్తబ్దత నుంచి అభివృద్ధి పథంలో ఉరకలు ఎత్తిస్తారని చాలామందిలో నమ్మకం ఏర్పడింది. ప్రస్తుత తరుణంలో కావలసిన విప్లవాత్మక సంస్కర్తను తానేనని ఆయన జనాన్ని ఒప్పించ గలిగారు. ఆర్థికాభివృద్ధికి ఊపు తెచ్చి కోట్ల ఉద్యోగాలను సృష్టిస్తానని ఓటర్లకు, ముఖ్యంగా యువ ఓటర్లకు భరోసా ఇచ్చారాయన. కనీస ప్రభుత్వం, గరిష్ఠ పాలన, అచ్చే దిన్ తదితర నినాదాలు జనాన్ని విపరీతంగా ఆకట్టుకున్నాయి. అప్పటికీ ఇప్పటికీ అయిదేళ్లు గడిచాయి. అటు సమూల సంస్కరణలు గానీ ఇటు కొత్త ఉద్యోగాలు గానీ పట్టాలకెక్కలేదు.

ప్రభుత్వ నిర్ణయాలు సమర్థంగా అమలు చేయాలంటే దక్షత గల అధికార గణం అవసరం. ఆర్థిక వ్యవస్థ ఆనుపానులు తెలిసి సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోగల అధికారులను కీలక స్థానాల్లో నియమించాలి. వారికి విస్తృత సైద్ధాంతిక అవగాహన, ఆచరణాత్మక అనుభవం ఉండాలి. ప్రస్తుత ప్రభుత్వంలో అధికారులు ఏలినవారిని మెప్పించడానికి తమ సమయాన్ని, శక్తియుక్తులను ధారపోశారు. అంతే తప్ప క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావడంపై దృష్టి పెట్టలేదు. మొదటి మూడేళ్లలో కీలక ఆర్థిక సంస్థల నిర్వహణకు విదేశాల నుంచి నిపుణులను రప్పించుకున్నారు. వీరికి తమదైన రంగంలో పట్టు ఉన్న మాట నిజమే. కానీ ఈ దేశ స్థితిగతులు, ప్రజలు, పారిశ్రామికవేత్తల స్వభావం గురించి వారికి ఏమాత్రం అవగాహన లేదు. పెద్దనోట్ల రద్దు సమయంలో వారు ప్రభుత్వానికి సరైన సలహాలు ఇవ్వలేకపోవడానికి కారణమిదే. స్థానిక పరిస్థితుల గురించి పూర్తిగా తెలియకపోవడం వల్ల సరైన దిశానిర్దేశం చేయలేకపోయారు. నీతి ఆయోగ్ తొలి ఉపాధ్యక్షుడు ఆ కోవకే చెందుతారు. రిజర్వు బ్యాంకు గవర్నర్ ఉర్జిత్ పటేల్ సైతం పెద్దనోట్ల రద్దు అమలుకు సరైన సారథ్యం వహించలేకపోయారు. దేశ ఆర్థికవ్యవస్థకు చుక్కాని వంటి

రిజర్వుబ్యాంకుకు నాయకత్వం వహించే వ్యక్తికి ఈ దేశ స్థితిగతులతోపాటు ప్రభుత్వం పనిచేసే విధానం గురించి పూర్తిగా తెలిసుండాలి. అప్పుడు మాత్రమే వారు సర్కారుకు సరైన సలహాలు ఇవ్వగలుగుతారు. గతంలో రిజర్వు బ్యాంకు గవర్నర్లుగా నియమితులైన వారిలో అత్యధికులు ప్రభుత్వ యంత్రాంగంలో పనిచేసి పైకొచ్చినవారే. రఘురాం రాజన్, ఉర్జిత్ పటేల్‌కు ప్రభుత్వంతో ఏమాత్రం పొసగలేదు. దీంతో ఉర్జిత్ పటేల్ రాజీనామా చేయవలసి వచ్చింది.

పెద్దనోట్ల రద్దు, వస్తు సేవల పన్ను ప్రభుత్వ ఖాతాలో పరాజయాలుగా నిలిచిపోతాయి. ఇవి లోతుగా ఆలోచించి తీసుకున్న నిర్ణయాలు కావు. వాటి అమలు పూర్తిగా లోపభూయిష్టం. ఆ నిర్ణయం అమలైన సంవత్సరంలో జీడీపీ వృద్ధి రేటు 6.7 శాతానికి పడిపోయింది. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) అమలు సైతం దూరదృష్టి, లోతైన ఆలోచన లేకుండా హడావుడిగా తీసుకున్న నిర్ణయమే. ప్రపంచంలో మరే దేశంలోనూ భారత్‌లో మాదిరిగా తొమ్మిది జీఎస్‌టీ శ్లాబులు లేవు. మరెక్కడా ఇంతటి అధిక పన్ను రేట్లు లేవు. భారత్‌లో అసంఘటిత రంగం చాలా పెద్దది. ఇక్కడ అంతర్జాల సౌకర్యం పూర్తిగా అందుబాటులోకి రాలేదు. అయినా అంతర్జాల ఆధారిత జీఎస్‌టీ వ్యవస్థను తీసుకురావడానికి సర్కారు తొందరపడటం కష్టనష్టాలకు కారణమైంది. జీఎస్‌టీ వల్ల ప్రభుత్వం ఇంతవరకు లక్ష కోట్ల రూపాయల ఆదాయం నష్టపోయిందని అంచనా. జీఎస్‌టీ వచ్చిన తరవాత నాలుగు నెలల్లో తప్ప మిగతా కాలమంతా ప్రభుత్వ ఆదాయం అంచనా వేసిన దానికన్నా తక్కువేనని లెక్కతేలింది.

అయిదేళ్ల జమానాలో వైఫల్యాలను పట్టించుకోకుండా, నినాదాలతో పొద్దుపుచ్చారు. ఈ హడావుడిలో బ్యాంకింగ్, వ్యవసాయ రంగాలను అలక్ష్యం చేశారు. ఈ రంగాల్లో సమస్యలు తలెత్తిన వెంటనే చర్యలు తీసుకోకుండా వ్యవహారాన్ని నాన్చడంతో అవి పెరిగి పెరిగి పెద్దవయ్యాయి. 2014 జూన్ 30 నాటికి దాదాపు రూ. 2.25 లక్షల కోట్లుగా ఉన్న బ్యాంకుల నిరర్థక ఆస్తులు 2018 డిసెంబరుకల్లా సుమారు రూ.10.35 లక్షల కోట్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంకు తెలిపింది. అసలు ఇంతకీ బ్యాంకుల నిరర్థక ఆస్తుల లెక్కింపు పూర్తయిందో లేదో ఇతిమిత్థంగా తెలియదు. ఈ సమస్యను ఇలానే పేరబెడితే బ్యాంకులు నష్టాల ఊబి నుంచి బయటపడలేక యావత్ ఆర్థికరంగమే అతలాకుతలమవుతుంది. బ్యాంకులను గాడిలో పెట్టడానికి రిజర్వుబ్యాంకు గట్టి చర్యలు తలపెట్టినా ప్రభుత్వం గుర్రుగా ఉండటంతో ఆ ప్రయత్నాలు మానుకోవలసి వచ్చింది.

## చతికిలపడ్డ సేద్యం

వ్యవసాయంలోనూ ప్రభుత్వ నిష్క్రియాపరత్వమే పుట్టి ముంచింది. ప్రభుత్వానికి దూరాలోచన లోపించడంతో పంటల ధరలు పతనమయ్యాయి. సేద్య రాయితీలను ఉపసంహరించడంతో ఎరువులు, క్రిమినాశనుల ధరలు పెరిగిపోయి వ్యవసాయం గిట్టుబాటు కాకుండా పోయింది. 2015లో పప్పు గింజల సాగును ఇబ్బడిముబ్బడిగా పెంచాలని ప్రధాని మోదీ రైతులను కోరారు. అయితే పెరిగిన పంటను నిల్వచేయడానికి అవసరమైన అదనపు గిడ్డంగుల నిర్మాణానికి మాత్రం చొరవ తీసుకోలేదు. దాంతో రైతులు తమ పంటను అయినకాడికి తెగనమ్ముకోవలసి వచ్చి నష్టాల పాలయ్యారు. అసలే అప్పుల భారంతో సతమతమవుతున్న రైతాంగం మీద పప్పు గింజల సాగు కోసం చేసిన కొత్త అప్పులు మీదపడ్డాయి. పప్పుగింజల కొరతను అధిగమించడానికి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయాలనడం మంచి నిర్ణయమే. కానీ, దాన్ని సక్రమంగా అమలు చేయడానికి అవసరమైన మంచి విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించలేకపోయారు. అన్ని ఏర్పాట్లు చేసుకున్న తరవాతే రైతులను పప్పు గింజల సాగుకు ప్రోత్సహించాల్సి ఉంది. అసలు రైతులు ఏ పంట వేయాలో, ఎప్పుడు వేయాలో ప్రభుత్వం చెప్పడమేమిటి? ఆర్థిక సరళీకరణ అంటే సరైన మార్కెటింగ్ యంత్రాంగాన్ని, నిల్వ వసతులను, రుణ సదుపాయాన్ని కల్పించి రైతులను గిరాకీకి తగ్గట్టు సరఫరా చేసేలా సన్నద్ధుల్ని చేయడం! అలా కాకుండా ప్రధానమంత్రి ఫలానా పంట వేయాలని రైతులకు సలహా ఇవ్వడంలో అర్థం లేదు. దానికన్నా రైతులకు కావలసిన వనరులను ముందుగానే సిద్ధం చేయడం మంచిది. ఇలా ప్రతి విషయంలో అరకొర ఏర్పాట్లు, అస్తవ్యస్త నిర్ణయాలు అయిదేళ్ల కాలంలో రైతులను, వినియోగదారులను, వ్యాపార నిర్వాహకులను కడగండ్ల పాల్జేస్తూ వచ్చాయి! ○


# రాజకీయ ప్రశ్నోపనిషత్తు!

**- ఎ. కృష్ణారావు,** సీనియర్ జర్నలిస్టు

**వ్యక్తులపై, నేతలపై, వర్గాలపై ద్వేషం పెంచుకుని, బలమైన అభిప్రాయాలను ఏర్పర్చుకున్న వారు రెండు వర్గాల్లోనూ కనపడుతున్నారు. ఫలానావారు తప్పకుండా ఓడిపోవాల్సిందే అని ఖచ్చితంగా చెప్పేవారు రెండింటిలోనూ ఉన్నారు. ఇంత కలుషిత, విభజన పూరిత రాజకీయ వాతావరణం గతంలో ఎప్పుడూ లేదు. పోనీ ఇందుకు బలమైన కారణాలున్నాయా అంటే కూడా చెప్పలేని పరిస్థితుల్లో చాలా మంది ఉన్నారు. ఫలానావారు ఓడిపోతే మీకేమైనా లాభం కలుగుతుందా, ఫలానా వారు అధికారంలోకి వస్తే ఇంతకన్నా అద్భుతంగా పాలిస్తారని నమ్మకం ఉన్నదా అన్న విషయంపై కూడా వారికి అవగాహన లేదని అర్థమవుతోంది.**

***ప్రజల ముందున్న ప్రధాన ప్రశ్న ఎవర్ని ఎన్నుకోవాలన్నది. పార్టీలు, వాటి నేతలు, వాటి ఎన్నికల ప్రణాళికలు, వాగ్దానాలు ఒక ఎత్తు అయితే, కళ్ల ముందు కనబడుతున్న అభ్యర్థులు మరో ఎత్తు. తాము ఎన్నుకున్న అభ్యర్థులే తమను లూటీ చేస్తుంటే, పనుల కోసం కమీషన్లు వసూలు చేస్తుంటే పార్టీల సిద్ధాంతాలు చూసి ఓటు వేయాలో, అధినేతల ముఖం చూసి ఓటు వేయాలో వారు తేల్చుకోలేకపోతున్నారు. ప్రజలు ఓటుకు అమ్ముడుపోయినప్పుడు తాము మాత్రం నిజాయితీగా ఎందుకు పనిచేయాలని, తమకయ్యే ఖర్చు ఎలా భరించాలని అభ్యర్థులు వేసే ప్రశ్నలకు కూడా జవాబులు లేవు. అసలు ధనప్రభావం వల్ల సిద్ధాంతం అనేది మటుమాయమవుతున్నది. 2019 ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, ఈ మౌలిక ప్రశ్నలకు, ప్రజల మౌలిక సమస్యలకు సమాధానాలు లభించేట్లుగా లేవు.***

ఒక భీకర సమరం తర్వాత, యుద్ధారావాలు చల్లారిన తర్వాత, తుఫాను సమసి ఏర్పడిన ప్రశాంతత తర్వాత తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు దేశ రాజధాని ఢిల్లీలో అడుగుపెట్టారు. కాని ఆయనను చూస్తే ఒక యుద్ధంతో తృప్తిపడినట్లు కనపడలేదు. ఎన్నికల కమిషన్ సృష్టించిన ఈవీఎంల గందరగోళంపై, ముఖ్యంగా కేంద్రంపై మరో యుద్ధానికి సమాయత్తమవుతున్నట్లు కనపడ్డారు. సమాజ్ వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్, జనతాదళ్ (ఎస్) నేత దేవెగౌడ, కాంగ్రెస్ నేతలు కపిల్ సిబాల్, అహ్మద్ పటేల్, శామ్ పిట్రోడా, ఇతర పార్టీల నేతలతో ఫోన్‌లోనూ, స్వయంగా చర్చలు జరిపారు. ఆ తర్వాత కర్ణాటక, తమిళనాడు పర్యటనలకు బయలుదేరారు. ఇదంతా భావి రాజకీయ వ్యూహానికి పావులు కదుపుతున్నట్లే కనిపిస్తోంది. కాని ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన యుద్ధంలో చంద్రబాబు నాయుడు విజయం సాధించినట్లేనా? ఇదే ప్రశ్నను ఆయనకు వేశాను. గత మూడున్నర దశాబ్దాలుగా కెరటాలుగా ఎగసిపడుతున్న ఆయన జయాపజయాలను, సంఘర్షణాయుత తత్వాన్ని, ప్రతికూలతలను అనుకూలతలుగా మార్చుకోగలిగిన శక్తినీ గమనించిన నేపథ్యంలో ఆయనను ఒకే ప్రశ్నను అడిగాను. 'ఏమిటి సార్, ఒక వైపు మీరు




బ్రహ్మాండమైన విజయం సాధిస్తున్నట్లు వార్తలు వస్తుంటే, మరో వైపు అవతలి పక్షం కూడా విజయం సాధించినట్లేనని చెప్పుకుంటున్నది. వారిలో ఆ విశ్వాసానికి కారణమేమిటి..?" అని అడిగాను. చంద్రబాబు నాయుడు చిరునవ్వు నవ్వి, 'ఆ విషయంలో ఏమాత్రం సందేహం అక్కర్లేదు బ్రదర్, రాత్రి పొద్దుపోయేవరకు మహిళలూ, వృద్ధులూ క్యూలలో వేచి ఉండి మరీ ఓటు వేశారంటే ఎవరికి వేశారంటారు.. పెద్దఎత్తున

హైదరాబాద్ నుంచి కూడా జనం వచ్చి ఓటు వేశారు. ఇదంతా ప్రభుత్వానికి సానుకూల పవనాలు వీస్తున్నాయనడానికి సంకేతాలు..' అని ఆత్మవిశ్వాసంతో చెప్పారు. బహుశా ఈ ఆత్మవిశ్వాసం ఉన్నందువల్లే ఆయన భవిష్యత్ కార్యాచరణకు సిద్ధమవుతున్నారు.

విచిత్రమేమంటే రాజకీయ పరిస్థితులను అంచనా వేయడానికి ఎవరితో మాట్లాడినా వారు ఏదో ఒక పక్షం వైపు మాట్లాడుతున్నట్లు కనపడు తున్నారు. రాజకీయాలు మనుషుల్ని చీల్చివేసినట్లు కనపడుతోంది. ఎవరు పార్టీ కార్యకర్తలో, ఎవరు కారో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. వ్యక్తులపై, నేతలపై, వర్గాలపై ద్వేషం పెంచుకుని, బలమైన అభిప్రాయాలను ఏర్పర్చుకున్న వారు రెండు వర్గాల్లోనూ కనపడుతున్నారు. ఫలానావారు తప్పకుండా ఓడిపోవాల్సిందే అని ఖచ్చితంగా చెప్పేవారు రెండింటిలోనూ ఉన్నారు. ఇంత కలుషిత, విభజన పూరిత రాజకీయ వాతావరణం గతంలో ఎప్పుడూ లేదు. పోనీ ఇందుకు బలమైన కారణా లున్నాయా అంటే కూడా చెప్పలేని పరిస్థితుల్లో చాలా మంది ఉన్నారు. ఫలానావారు ఓడిపోతే మీకేమైనా లాభం కలుగుతుందా, ఫలానా వారు అధికారంలోకి వస్తే ఇంతకన్నా అద్భుతంగా పాలిస్తారని నమ్మకం ఉన్నదా అన్న విషయంపై కూడా వారికి అవగాహన లేదని అర్థమవుతోంది. ఈ కారణాల రీత్యా ఢిల్లీ నుంచి ఎవరితో మాట్లాడాలనుకున్నా వారు ఆరోగ్యకరమైన అంచనాలు చెబుతారన్న నమ్మకం లేకుండా పోయింది. 'అవిద్యయామంతరే వర్తమానా ..స్వయంధీర వందితం మాన్యమానా ..తంత్రమ్యమాన పరియంతి మూఢా, అంతే నైవతీన మాయయతాంతా..' అని కఠోపనిషత్తులో చెప్పినట్లు ప్రతి వాడూ తాను చెప్పేది సాధికారికంగా చెబుతున్నానను కుంటాడు. దీన్నే నిజంగా భావిస్తే ఒక గుడ్డివాడు మరో గుడ్డివాడిని నమ్మి వెంట ప్రయాణం చేసినట్లవుతుంది. ఇద్దరూ బొక్కబోర్లా పడేవరకూ వాస్తవాలు అర్థం కావు. మన సమాజంలో ఈ కుహనా మేధావులే రాజకీయాల్లో కూడా ప్రవేశించి వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు.

అయితే ఇందులో ఒక విశేషం కూడా లేకపోలేదు. సమాజం ఈ రకంగా విడిపోవడం ఒక రకమైన అంతర్మథనానికి కూడా సంకేతం. పత్రికల్లోనూ, సోషల్ మీడియాలోను, సమాజంలోని ఇతర వేదికలపైనా ఎంత తీవ్రాతితీవ్రంగా చర్చలు జరిపినా ప్రజల్లో కూడా ఒక అంతర్మథనం జరిగే ఉంటుంది. ఈ అంతర్మథనమే ఒక ఆరోగ్యకరమైన పరిణామంగా మారింది. లేకపోతే ఓటు వేయడానికి జనం అంత ఉత్సాహం ప్రదర్శించనక్కర్లేదు. ఈవీఎంలు మొరాయించడం వల్లో, మరో కారణం వల్లో ఇంటికి తిరిగి వెళ్లిన వాళ్లు 'ఏ పార్టీ గెలిస్తే ఏం ఒరుగుతుందిలే..' అని ఇంట్లోనే కూర్చోకపోవడం ఒక ఆశ్చర్యకరమైన విషయం. తాము ఒక పార్టీని గెలిపించాలని భావించినందువల్లే వారు ఓటు వేయడానికి కొంత కష్టాన్ని భరించడానికి సిద్ధమయ్యారు. 'తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించేందుకు క్యూలో నిలబడతాం కదా.. ఇక్కడ కూడా అలాగే నిలబడి ఓటు వేయడానికి వచ్చాం. మాకు ఇష్టమైన నేతను గెలిపించుకోవాలనుకుంటున్నాం.. ఆయనెవరో మీకు చెప్పం..' అని ఒక మహిళ ఒక టీవీ ఛానెల్ విలేఖరితో చెప్పడం గమనార్హం. ఈ ఎన్నికలు ఒక స్పష్టమైన ఫలితాలను ఇస్తున్నా యనడానికి ఆమె మాటల్ని సంకేతంగా భావించాలి.

దేశవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న తీరును చూస్తుంటే మన దేశంలో నల్ల ధనం ఏ విధంగా దేశ ఆర్థిక వ్యవస్థలను కుదేలు పరుస్తున్నదో అర్థమవుతోంది. ఎన్నికల కమిషన్ తరపున పోలీసులు చేస్తున్న దాడుల్లో పట్టుబడిన సొమ్ముకూ, ఎన్నికల్లో ఖర్చవుతున్న సొమ్ముకూ హస్తిమశకాంతరం ఉన్నది. 'నాకు వందకోట్లు ఖర్చయింది..' అని లోక్ సభకు పోటీ చేసిన ఒక అభ్యర్థి చెప్పుకున్నారు. 'ఎమ్మెల్యేలు 20 కోట్ల వరకూ అడుగుతున్నారు..' అని ఎంపి పదవికి పోటీ చేసిన మరో అభ్యర్థి చెప్పుకున్నారు. ఓటుకు రూ. 2 వేల చొప్పున పంచినట్లు కూడా వార్తలు వస్తున్నాయి. ఈ మొత్తం అంతా ఎక్కడి నుంచి వస్తోంది? దీనికి లెక్కా పత్రమైనా ఉన్నదా? అన్న ప్రశ్నలకు జవాబులు లేవు. ఈ మొత్తం అంతా నల్లధనమే అని చెప్పడానికి ఎలాంటి సందేహం అక్కర్లేదు. మరి నల్లధనాన్ని నిర్మూలిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ ఎన్నికల వ్యవస్థలో దాన్ని ఎందుకు నిర్మూలించలేకపోతున్నారు? ఒకరోజు ఢిల్లీలో బస్సు ఎక్కినప్పుడు ఒక ప్రయాణీకుడు తనకు కండక్టర్ ఇవ్వాల్సిన రూ. 2 చిల్లర కోసం పదే పదే అడుగుతుండడం చూశాను. ఒక మెట్రో రైలు కార్మికుడు వేయి రూపాయల ఖర్చుకు డైరీలో లెక్కలు రాసుకుంటూ పదే పదే లెక్కించడం, జేబులో చిల్లర చూసుకుని ఆందోళన పడడం గమనించాను. సామాన్యులకు తాము సంపాదించిన ప్రతి పైసా ముఖ్యమైనది. అందుకోసం వారు మైళ్లకు మైళ్లు సైకిళ్లపై, బస్సుల్లో ప్రయాణించి చిన్న చిన్న ఉద్యోగాలకు వెళతారు. కాని నేతలు

ఎన్నికల్లో గెలిచేందుకు వేల కోట్లు అవలీలగా ఖర్చు పెడుతుంటే, ఆ కోట్లు ఖర్చు పెట్టగలిగినవారికే పార్టీలు టికెట్లు ఇస్తుంటే ఏమని అర్థం చేసుకోవాలి? ఇలాంటి రాజకీయ నాయకులపై ప్రజలకు ఎందుకు సదభిప్రాయం ఏర్పడుతుంది? ఓట్ల కోసం వీధుల్లో, గల్లీల్లో, మురికివాడల్లో తిరిగే నేతలు ఆ తర్వాత బిఎండబ్ల్యు కార్లలోనో, వోక్ వాగన్ కార్లలోనో తిరిగితే వారు నిజమైన ప్రజాప్రతినిధులని ఎలా అర్థం చేసుకోవాలి?

అసలు ఎన్ని కోట్లయినా ఖర్చుపెట్టి ప్రజాప్రతినిధి కావడానికి ఎవరైనా ఎందుకు సిద్ధపడతారు? బడా పారిశ్రామికవేత్తలు ఎన్ని కోట్లయినా ఖర్చు పెట్టి ఎన్నికయ్యేందుకు ఎందుకు ఉత్సుకత ప్రదర్శిస్తారు? ఒక పారిశ్రామిక వేత్త ఒక పార్టీకి నిధులు అందిస్తున్నారని తెలియడంతో జాతీయ పార్టీ ఆదేశాలతో ఆదాయపన్ను శాఖ వారు అతడి వ్యాపార సంస్థలపై దాడులు చేసేందుకు సిద్ధమయ్యారు. దీనితో అతడు ఢిల్లీ దాకా వచ్చి తాను ఏ పార్టీకీ నిధులు ఇవ్వబోనని చెప్పి లెంపలేసుకుని తన పేరును జాబితా నుంచి తొలగించేలా చేసుకున్నాడు. ఒక పారిశ్రామికవేత్త ఒక పార్టీ నుంచి రాజీనామా చేసి మరో పార్టీ తరపున పోటీ చేయడానికి కూడా ఇదే అస్త్రం ప్రయోగించారని తెలిసింది. ఎంపీలైన చాలామంది పారిశ్రామికవేత్తలు ఎన్నికైన కొద్దిరోజుల్లోనే ఆర్థిక మంత్రి, వాణిజ్య మంత్రి, ఇతర మంత్రుల చుట్టూ బాహాటంగా తిరిగిన సందర్భాలున్నాయి. 'ఇదేంది బ్రదర్, ఫలానా ఎంపీ ఎప్పుడు చూసిన తన కంపెనీ లెటర్ హెడ్ పట్టుకుని మా చుట్టూ తిరుగుతాడు' అని ఒక మంత్రి వ్యాఖ్యానించారు. ఎంపీలుగా మారడమంటే ఈ పారిశ్రామిక వేత్తలకు తమ వ్యాపార సామ్రాజ్యాలను విస్తరించడమన్నమాట. బ్యాంకుల రుణాలు ఎగవేసేందుకు, కొత్త రుణాలు సంపాదించేందుకు, కాంట్రాక్టులు పొందేందుకు, సూట్ కేస్ కంపెనీలపై నిఘా సంస్థల కన్ను పడకుండా చూసుకునేందుకు ఈ పదవులు ఉపయోగపడతాయి. కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి ఎంపీలైనవారు అంతకు రెట్టింపు సంపాదించేందుకు ప్రయత్నిస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ క్రమంలో ఎంపీలకు కేటాయించిన ప్రభుత్వ బంగళాలు కార్పొరేట్ కార్యాలయాలుగా మారతాయి. అక్కడ నిత్యం విందులు, వినోదాలు, లాబీయింగ్‌లు జరుగుతాయి. చివరకు సిబిఐ వంటి సంస్థల అధికారులను, న్యాయమూర్తులను కూడా ముగ్గులోకి లాగే ప్రయత్నాలు జరుగుతాయి. ఎన్నికల వ్యవస్థలో ధనస్వామ్యం, నల్లధనం ప్రవేశించడం వల్ల జరిగే దుష్పృత్యాలు ఇవి. ఒక స్థాయికి వచ్చిన తర్వాత ఎవరి పాపాలు ఎలాంటిలో అందరికీ అర్థమవుతాయి. ఎన్నికల సమయంలో ఈ బలహీనతలను ఆసరాగా తీసుకుని విజయం సాధించేందుకు లేదా రాజకీయ ప్రయోజనాలు నెరవేర్చుకునేందుకు ఒకరి జుత్తు మరొకరు పట్టుకునేందుకు ప్రయత్నిస్తారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో ఎన్నికల వ్యవస్థలో ఈ దారుణాలు మరింత తీవ్రతరమయ్యాయి. ఈ దేశంలో అత్యధిక విరాళాలు పొందిన పార్టీ భారతీయ జనతా పార్టీ అనడంలో సందేహం లేదు. రూ. 10 లక్షలు, రూ. కోటి మొత్తాలకే 99 శాతం ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసినట్లు సమాచార హక్కు కింద వేసిన ఒక ప్రశ్న ద్వారా తెలిసింది. సుప్రీంకోర్టు ఈ బాండ్లను ఎవరు కొనుగోలు చేశారో సీల్డు కవర్‌లో సమర్పించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. అసలు ఎవరు కొనుగోలు చేశారో, వారికి ఆ డబ్బు ఎలా వచ్చిందో ఎందుకు ఆరా తీయకూడదు? బిజెపి కనుసన్నలతోనే బడా పారిశ్రామిక వేత్తలు భారీ ఎత్తున దేశంలో వివిధ ప్రాంతాలకు, పార్టీలకు డబ్బులు సరఫరా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రాణప్రదమైన ఎన్నికల వ్యవస్థలో నల్లధనాన్ని నిర్మూలించేంతవరకూ నిజమైన ప్రజాప్రతినిధులు పార్లమెంటరీ వ్యవస్థలో అడుగుపెట్టేందుకు అవకాశాలు లేవు. విదేశాల్లో ఉన్న నల్లధనం మాట దేవుడెరుగు, స్వదేశంలో ఉన్న నల్లధనాన్ని నిర్మూలించడంలోనే మన ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

ఈ మొత్తం క్రమంలో ప్రజల ముందున్న ప్రధాన ప్రశ్న ఎవర్ని ఎన్నుకోవాలన్నది. పార్టీలు, వాటి నేతలు, వాటి ఎన్నికల ప్రణాళికలు, వాగ్దానాలు ఒక ఎత్తు అయితే, కళ్ల ముందు కనబడుతున్న అభ్యర్థులు మరో ఎత్తు. తాము ఎన్నుకున్న అభ్యర్థులే తమను లూటీ చేస్తుంటే, పనుల కోసం కమీషన్లు వసూలు చేస్తుంటే పార్టీల సిద్ధాంతాలు చూసి ఓటు వేయాలో, అధినేతల ముఖం చూసి ఓటు వేయాలో వారు తేల్చుకోలేక పోతున్నారు. ప్రజలు ఓటుకు అమ్ముడు పోయినప్పుడు తాము మాత్రం నిజాయితీగా ఎందుకు పనిచేయాలని, తమకయ్యే ఖర్చు ఎలా భరించాలని అభ్యర్థులు వేసే ప్రశ్నలకు కూడా జవాబులు లేవు. అసలు ధనప్రభావం వల్ల సిద్ధాంతం అనేది మటుమాయమవుతున్నది. 2019 ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా, ఈ మౌలిక ప్రశ్నలకు, ప్రజల మౌలిక సమస్యలకు సమాధానాలు లభించేట్లుగా లేవు. ❍

# నిర్లక్ష్య పాలనకు యువత మూల్యం చెల్లిస్తున్నారు



ఇంటర్మీడియెట్ పరీక్షా ఫలితాలను వెల్లడించటంలో ఘోరవైఫల్యం టీఆర్ఎస్ ప్రభుత్వ ఏకపక్ష, నిర్లక్ష్య పాలనకు అద్దం పడుతోందని లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి ఇంఛార్జి వంశీప్రసాద్ అన్నారు. తనకు జోహుకుం అనే ఐఏఎస్ అధికారులను చుట్టూ పోగేసుకుని, ప్రజలకు తాత్కాలిక తాయిలాల్ని పంచితే, అవసరమనుకున్నప్పుడు ఉద్రేకాల్ని రెచ్చగొడితే చాలు గెలుపు ఖాయమని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు భావిస్తున్నారన్నారు. దీనివల్ల బంగారు తెలంగాణ రావటం మాట అలా ఉంచి, యువత బలివశు వులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం భేషజాలు లేకుండా సకాలంలో సక్రమంగా స్పందించి ఉంటే ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యల్ని, వారి ఆందోళనల్ని చాలావరకు నివారించగలిగి ఉండేవారన్నారు. అల్లాపూర్ డివిజన్‌లోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.

ఇంటర్ బోర్డు తప్పిదాలపై తేల్చటానికి కమిటీలు అక్కర్లేదని, ఒక బహిరంగ చర్చ పెట్టి నిపుణులను, పౌర, రాజకీయ నేతలను, మీడియా, గ్లోబరీనా ప్రతినిధులు, ఇంటర్ బోర్డు అధికారులను ఆహ్వానిస్తే ఒక్కరోజులో మొత్తం వాస్తవాలు తెలంగాణ సమాజానికి తేటతెల్లమవుతాయని వంశీ ప్రసాద్ అన్నారు. ఉద్యమ స్వభావంతో ఎటువంటి అరమరికలు లేని పాలన అందిస్తారని కేసీఆర్‌ను గెలిపించారని, ప్రతిదీ రహస్యమే, ఏకపక్షమే అన్నట్లు నిర్లక్ష్యంగా పాలన సాగుతోందన్నారు. నిజాలు చెప్పటానికి ప్రయత్నించినవారి మీద అణచివేత చర్యలకు బదులు వాస్తవాల్ని ప్రజల ముందుంచే పారదర్శక చర్యల్ని అమలు చేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇంటర్ పేపర్లను ఆన్‌లైన్‌లో ఆయా విద్యార్థులు పరిశీలించుకోగలిగే ఏర్పాట్లు చేయటం వంటి మార్పుల్ని కూడా పరిశీలించాలన్నారు. విద్యార్థులెవరూ ఆత్మహత్యలు వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవాల్సిన పనిలేదని, అవరోధాల్ని అధిగమించి మెరుగైన విజయాల్ని సాధించే అవకాశాలు బోలెడు ఉన్నాయని అన్నారు. తల్లిదండ్రులు సమస్యను ఇంకా జటిలం చేసే ప్రయత్నం చేయకుండా పరిష్కారంలో భాగమవ్వాలన్నారు. లోక్‌సత్తా పార్టీ నేతలు లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం, తిరుపతిరావు, నరేష్, ఆనంద్, చిరంజీవి, శివ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# విలువల రాజకీయాలు ఉత్తరాంధ్ర సొంతం

జిల్లా, రాష్ట్ర స్థాయిలోనేకాక దేశ రాజకీయాల్లో విలువలతో కూడిన రాజకీయాల్ని ఉత్తరాంధ్ర నేతలు నడిపారని, అలా విలువల కోసం జీవించటమేకాకుండా వాటిని తర్వాతి తరాలకు కూడా అందించటానికి డా॥ పీవీజీ రాజు కృషి చేశారని మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర చర్చా వేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణ అన్నారు. పీవీజీ 96వ జయంతి సందర్భంగా పీవీజీ రాజు కళావేదిక విజయనగరంలో ఏర్పాటు చేసిన స్మారక పురస్కార ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రజలకు విద్యను అందించాలని పీవీజీ తపన పడ్డారని, సాగునీటి రంగంలో ముందుచూపుతో అనుమతుల్ని సంపాదించి ప్రాజెక్టుల నిర్మాణానికి కృషి చేశారని అన్నారు. మాజీ మంత్రి రెడ్డిసత్యనారాయణ మాట్లాడుతూ, పీవీజీ లాంటి మహోన్నత వ్యక్తి ఉత్తరాంధ్ర నుంచి ఉండటం ఎంతో అదృష్టమని, విద్యావ్యాప్తి కోసం ఆయన చాలా కష్టపడ్డారని అన్నారు. తాను విజయనగరం మహారాజా కళాశాలలో చదివి డాక్టర్ అయ్యానని, ఎంపీగా ఎన్నికయ్యానని, దేశ రాజకీయాల్లో పీవీజీకి గొప్ప కీర్తి ఉండేదని మాజీ ఎంపీ కణితి విశ్వనాథం అన్నారు. ప్రస్తుత రాజకీయ నాయకులు ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల మీద దృష్టి పెట్టాలన్నారు. పీవీజీ పురస్కారం అందుకోవటం తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. పురస్కారాలు అందుకున్నవారిలో






డా॥ ఎం.వెంకటేశ్వరరావు, గొలుగూరి నాగిరెడ్డి, యార్లగడ్డ బాబూరావు, ఎలిశెట్టి సురేష్, టి.వి భగవాన్‌దాస్, కాటూరి సుభాష్‌చంద్రబోస్, ఎస్.సత్యనారాయణ, త్రినాథ్ ఉన్నారు. వేదిక అధ్యక్షుడు, లోక్‌సత్తా పార్టీ ఏపీ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, కార్యదర్శి కొత్తా సునీల్, నేరెళ్ల వెంకటరావు, హృశీకేశం, శ్రీనివాసరావు, దూసి రాజేశ్వరరావు, లక్ష్మణరావు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరగాలి, ఉత్తరాంధ్రలో ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తాం: లోక్‌సత్తా



సర్పంచ్ నుంచి మేయర్ వరకు త్వరలో జరగనున్న స్థానిక ప్రభుత్వాల ఎన్నికలన్నీ ప్రత్యక్ష పద్ధతిలో జరగాలని, ఆంధ్రప్రదేశ్‌లో అధికారం లోకి వచ్చే ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. శృంగవరపుకోటలో జరిగిన లోక్‌సత్తా పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు కమిటీలు సహా స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికల డిమాండ్‌తో త్వరలో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో అన్ని పార్టీలనూ కలుపుకుని అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తామన్నారు. రాజకీయ పార్టీల, ప్రజల మద్దతును కూడగట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. గతంలో ఎన్.టి రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించి కొత్త నాయకత్వానికి రాష్ట్రంలో చోటు కల్పించారని, ఈవేళ జరుగుతున్న స్థానిక ఎన్నికలు ప్రజాభిప్రాయానికి చోటు లేని విధంగా ఎలాగోలా అధికారమే లక్ష్యంగా జరుగుతున్నాయని అన్నారు. అందుకే ఎవరు అధికారంలోకి వచ్చినా ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగడం లేదన్నారు. మండలాలు, పురపాలక, నగరపాలక సంస్థలు అభివృద్ధి చెందాలంటే ప్రత్యక్ష ఎన్నికలు, అధికార వికేంద్రీకరణ జరగాల్సిందేనన్నారు. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు మాజీ సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. లోక్‌సత్తా పార్టీ విజయనగరం జిల్లా ప్రతినిధి కె.ప్రసాద్ మాట్లాడుతూ, ప్రత్యక్ష ఎన్నికల కోసం మండల స్థాయిలో ఉద్యమం నిర్మించాలని, అందుకు తగిన ప్రణాళికలను రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నాయకులు కె. నాగేశ్వరరావు, శంకరరావు, మోహన్, రామలక్ష్మి, శ్రీను, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల విరామానికి త్వరలో తెర దించుతాం



ఎన్నికల్లో పోటీకి ఇచ్చిన విరామానికి త్వరలో తెర దించుతామని లోక్‌సత్తా పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము తెలిపారు. ఈ విషయంపై లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ సమక్షంలో ఇటీవల నిర్వహించిన పార్టీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామన్నారు. ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాలపై దృష్టి సారించారని ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జరిగిన లోక్‌సభ, అసెంబ్లీ 2019 ఎన్నికలలో స్పష్టంగా కనిపించిందన్నారు. నిత్యం ప్రజాసమస్యలకు పరిష్కారాల్ని చూపుతూ ప్రజల్లో ఉండాలని జేపీ సూచించారన్నారు. ఇతరత్రా కొన్ని కారణాలుండటంతోపాటు, సాంప్రదాయ రాజకీయ పార్టీల పట్ల ప్రజలకు నమ్మకం సన్నగిల్లడం వల్లే లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ తగ్గిందన్నారు. 2014 ఎన్నికల తర్వాత నుంచి 2019 వరకు ఎన్నికల్లో పాల్గొనకూడదని లోక్‌సత్తా విరామం తీసుకుందని, ఈ నిర్ణయానికి లోక్‌సత్తా నేతలు, కార్యకర్తలు కట్టుబడి ఉన్నందుకు జేపీ కృతజ్ఞతలు తెలిపారని ఆయన చెప్పారు.

### ఇంటర్ అవకతవకలపై అఖిలపక్ష సమావేశం నిర్వహించండి

తెలంగాణ ఉద్యమం పారదర్శకతకు నిలువెత్తు నిదర్శనమని, ఇంటర్ బోర్డు అవకతవకలపై రహస్యాలు ఎందుకని రాము ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించి నిపుణులను, విద్యావేత్తలను, పౌర సమాజ నేతలను, అన్ని పార్టీలను, మీడియా, గ్లోబరీనా, ఇంటర్ ప్రతినిధులతో ప్రజల్లోకి ప్రత్యక్ష ప్రసార చర్చ పెట్టాలన్నారు. తప్పు ఎక్కడ జరిగింది, పరిష్కారం ఏమిటి వెంటనే తేలిపోతుందన్నారు. ఈ సమావేశ నిర్ణయాల ఆధారంగా ఇంటర్ బోర్డు నిర్వహణకు శాశ్వత పరిష్కార ఏర్పాట్లను ప్రభుత్వం చేయాలన్నారు. హైదరాబాద్ కాచిగూడలో ఇంటర్ విద్యార్థులతో ముఖాముఖి అనంతరం భానుప్రకాష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీలత, కృష్ణమూర్తి, శ్రీరాంరెడ్డి, విద్యాసాగర్ తదితర నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. పరీక్షల్లో ఫెయిల్యూర్లు వంటి వాటిని ఆడుతూపాడుతూ ఎదుర్కోవాలని విద్యార్థులకు సూచించారు.

# (మీడియాలో) 'కీ' కామెంట్లు!

■ స్వాతంత్ర్యం అనంతరం అంటరానితనాన్ని నిర్మూలించాలనుకున్న నాయకులు కులాన్ని పట్టించుకోలేదు. నిజానికి కులనిర్మూలన చేయకుండా అంటరానితనం పోదనే విషయాన్ని ఎవరూ గుర్తించలేదు. మంచి ఉద్దేశంతో రాజ్యాంగంలో పేర్కొన్న రిజర్వేషన్లను కులాలకు విస్తరిస్తూ.. రిజర్వేషన్ కోసం డిమాండ్ చేసే దుస్థితి తీసుకొచ్చారు.

– ఆనంద్ తేల్‌తుంబ్డే, రచయిత, సామాజిక కార్యకర్త

■ దేశ భవిష్యత్తును నిర్దేశించే ఎన్నికల పోరు జోరుగా సాగుతోంది. ఎన్నికల్లో పాల్గొనే పార్టీలు చాలా ఉత్సాహంతో, ప్రణాళికలతో ప్రజల్లోకి వెళుతున్నాయి. సభల్లో అధినాయకుల ప్రసంగాల్లోనూ ప్రజలకు హామీలు గుప్పించేస్తున్నారు. అయితే చాలా వరకు రాజకీయ పార్టీల ప్రణాళికల్లోనూ, ఓటర్ల సాక్షిగా నేతలు గుప్పిస్తోన్న హామీల్లోనూ ఎక్కడా కూడా ప్రజల నిజమైన సమస్యలను ప్రతిబింబిస్తున్న దాఖలాల్లేవనడంలో సందేహం అక్కర్లేదు. ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులతో ఏర్పడిన బడ్జెట్‌లూ, సహజ వనరులైన భూమి, అడవి, భూగర్భ సంపద అంతా కొందరి చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఈ స్థితిలో జరుగుతున్న ఎన్నికలు ప్రజల నిజమైన సమస్యలను ప్రతిబింబించకపోవడంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ సమాజం దీన్ని సమస్యగా భావించకపోవడమే నేరమౌతుంది.

– మల్లెపల్లి లక్ష్మయ్య, సామాజిక విశ్లేషకులు

■ ఒక పార్టీ టికెట్ మీద ప్రజలు గెలిపిస్తే, మరొక పార్టీని ప్రజలు ఉద్దేశపూర్వకంగా ఓడిస్తే, ఆ అభ్యర్థి ప్రజల అభిమతానికి భిన్నమైన పార్టీలో చేరుతున్న, చేర్చుకుంటున్న, అందుకు క్విడ్ ప్రోకోలా ఐదు కోట్ల ఎకరాల భూమిని యాభై లక్షలకు అందజేసిన రాజకీయ అవినీతి మాటేమిటి? ఇది కేవలం రెవెన్యూ శాఖ ఉంటుందా, ఉండదా.. రెవెన్యూ ఉద్యోగులను ఇతర శాఖలకు మారుస్తారా అనే రెవెన్యూ ఉద్యోగుల సమస్య కాదు (ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి ట్రేడ్ యూనియన్‌గా వారు ఆందోళన కార్యక్రమాన్ని ప్రారంభిస్తూనే ఇద్దరు రాజ్యాంగేతర శక్తుల దగ్గరికి పైరవీకి వెళ్లడం రాష్ట్రంలో అవినీతి విశ్వరూపానికి అద్దం పడుతున్నది!). ఇంతకూ అవినీతి అనేది ప్రజల సమస్య! అటు లంచాలు ఇస్తున్న కుటుంబాలకు చెందిన సొమ్ము, ఇటు ప్రభుత్వం నిర్వహించే విధులకు, ప్రజాజీవన అభివృద్ధికి వెచ్చించే ప్రజాధనం.. ప్రయివేటు వ్యక్తుల, రాజకీయ నాయకుల, కాంట్రాక్టర్ల, రియల్ ఎస్టేట్ వ్యాపారుల బొక్కసాలకు చేరుతున్నది. అందువల్ల గుర్తించవలసిన అంశం అవినీతి అంటే ప్రజాజీవన హననం అని. ప్రజాధనం దారి మళ్లింపు అని. అంటే అవినీతిని రూపుమాపడం రాజకీయ నాయకుల దాతృత్వమో, పరపతి పెంచుకునే మార్గమో కాదు, అది ప్రజల పురోభివృద్ధికి అవసరం.

- ఎన్. వేణుగోపాల్

■ గతంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి ఫిరాయించుకోలేదా? అన్న మొండి వాదన ఇప్పుడు సరికాదు. అలాంటి కుట్రపూరిత రాజకీయాలు వద్దు అనుకునే కదా, కొట్లాడి తెలంగాణను సాధించుకుంది. భావితరాలకు పార్టీ ఫిరాయింపులు అనే అంశం ఒక పాఠ్యాంశంగా మారకుండా చూసుకోవలసిన బాధ్యత కేసీఆర్‌దే!

- దొంతు రమేష్

■ నలభై మంది తృణమూల్ ఎమ్మెల్యేలు తమతో టచ్‌లో ఉన్నారని బెంగాల్‌లో నరేంద్రమోదీ అన్న మాటలు చాలామందిలో ఆశ్చర్యాన్ని ఆవేశాన్ని కలిగించి ఉండవచ్చును కానీ, తెలంగాణ రాష్ట్ర అధికార పార్టీ నాయకత్వానికి మాత్రం కించిత్ నైతిక ధైర్యాన్ని ఇచ్చి ఉండాలి. సాక్షాత్తూ ప్రధానమంత్రి అంతటివాడే బాహాటంగా ఫిరాయింపులను ఝుళిపిస్తుంటే, తెలంగాణలో జరుగుతున్నదాన్ని తప్పు పట్టడానికేముంది? దేశానికీ, జాతికీ నాయకత్వం వహించే నేత విలువలకు, నీతికి సంబంధించి కొత్తకొత్త ప్రమాణాలు నెలకొల్పగలిగి ఉండాలి. అవి దేశమంతటా ఆచరణీయం కావాలి. చక్రవర్తులే చేలో మేస్తున్నప్పుడు సామంతులు గట్టున మేస్తారా? కాంగ్రెస్ కానీ, టీఆర్ఎస్ కానీ పెద్దగా రాజకీయ నైతికత గురించి పట్టింపు ఉన్న పార్టీలు కావు కానీ, నిప్పుల్లో కడిగిన పార్టీ తమది అని చెప్పుకునే భారతీయ జనతా పార్టీ ఇంతగా పతనం కావడమే ఆశ్చర్యం. జయలలిత చనిపోయాక తమిళనాడులోను, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తరువాత పరిణామాలలోను భారతీయ జనతా పార్టీ అనుసరించిన పద్ధతులు, జనసంఘీయులకే కాదు, వాజపేయి కాలపు పార్టీ నేతలకు కూడా

మింగుడు పడేవి కావు. 2018 ఎన్నికలలో తెలంగాణలో ప్రతిపక్షాలకు, ముఖ్యంగా కాంగ్రెస్‌కు పడిన ఓట్లు ప్రత్యేకమైనవి. ఎన్నికలలో టిఆర్‌ఎస్ ఘనవిజయం సాధించింది. అటువంటి వాతావరణంలో కూడా కాంగ్రెస్ గెలుచుకున్న కొన్ని సీట్లు, ఆయా నియోజకవర్గాల ఓటర్ల బలమైన అభిమతానికి గుర్తు. టిఆర్‌ఎస్‌ను వద్దు అనుకుని, కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు వారు. ఆ అభిమతానికి అపచారం చేయడానికి ఆ ప్రజాప్రతినిధులకు ఏమి హక్కు ఉన్నది? ఇక్కడ జరుగుతున్నది ఫిరాయింపు కాదు, ప్రజాభీష్టానికి వంచన. దీన్ని ఓటర్లు నిలదీయాలి. కానీ, దురదృష్టవశాత్తూ, ఓటర్లు అసంఘటితులు. బాధిత పార్టీయే తన కార్యకర్తల ద్వారా తన ఓటర్లను సంఘటిత పరచాలి. కానీ, ఫిరాయిస్తున్న ప్రజాప్రతినిధి కార్యకర్తలతో సహా ఫిరాయిస్తుంటే? అంటే ఎవరికీ ఏ స్థాయిలోనూ తమ పార్టీ అంటే ఏ పట్టింపూ లేదన్న మాట. వారు కొత్తగా చేరుతున్న పార్టీ విషయంలోనూ రేపు అంతే. ఎప్పటికి ఏది ఉపయోగం అయితే, అప్పటికి ఆ పార్టీలో చేరడం అంతే. ఎటువంటి తరహా నేతలను మనం తయారుచేస్తున్నాము, ఎటువంటి వారిని మనం ప్రతినిధులుగా ఎంచుకుంటున్నాము, వాళ్లు నమ్మకద్రోహం చేస్తే ఎంత తేలికగా తీసుకుంటున్నాము- ప్రజలు ఈ ప్రశ్నలు వేసుకోవడం మొదలుపెడితే, సమస్యకు పరిష్కారం దిశగా అడుగులు పడవచ్చు.

- కె. శ్రీనివాస్, సీనియర్ సంపాదకులు

■ ప్రధాని చివరకు కులతత్వ ప్రచారాలకూ వెనుకాడటం లేదు. చౌకీదార్‌ను అనడమంటే బిసిలను అవమానించడమేనని వికృతమైన వాదన తీసుకున్నారు. ఒక దేశ ప్రధాని నుంచి కలలో కూడా ఊహించని ఆణిముత్యాలెన్నో మోదీ నోట జాలువారుతూనే ఉన్నాయి. తమాషా ఏమంటే ఇవేవీ మన ఎన్నికల సంఘానికి కనిపించడం లేదు.

– తెలకపల్లి రవి,సీనియర్ జర్నలిస్టు

■ పాక్ పాలకులు మసూద్ అజహర్ ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్‌తో పుల్వామా దాడి జరిపించకపోతే మోదీజీకి ఉగ్రూతలూగించే ఉపన్యాసాలు ఇవ్వడానికి అవకాశం ఉండకపోయేది. మోదీ పేదరికం, ఆర్థిక తిరోగమనం, పారిశ్రామిక మాంద్యం, వ్యవసాయరంగం దుస్థితి, రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగం, అసహనం తదితర సమస్యల గురించి మాట్లాడకుండా భారత సైన్యం చర్యలు తన విజయాలన్నట్లు మాట్లాడటం ఘోరం. మోదీజీ కోరుతున్నట్లు అణుబాంబులతో దీపావళి జరిగితే 'యుద్ధం శరణం గచ్ఛామి' అన్నదే మన విధానమైతే అదే చివరి దివాళీ అవుతుంది.

- దేవులపల్లి ప్రభాకరరావు

■ బ్యాలెట్ పత్రాలకు సంబంధించి కొన్ని అసౌకర్యాలు, సమస్యలు ఉన్న మాట నిజమే. కానీ, వాటికి ఉన్న విశ్వసనీయతను రెండు దశాబ్దాల తరవాత కూడా భారత్‌లో ఈవీఎంలు సంపాదించుకోలేకపోవడం ఆలోచించాల్సిన విషయం. ప్రస్తుత ఎన్నికల్లో ఈవీఎంల ద్వారా సైతం రిగ్గింగ్ చేయవచ్చన్న విషయం రుజువైంది. ఓటరు జాబితాలో పేర్లు ఉండి, ఓటు ఎలా వేయాలో తెలియనివారి తరఫున పోలింగ్ కేంద్రంలో ఉన్నవారు- పోలింగ్ సమయం ముగుస్తుండగా ఓట్లు తమకు ఇష్టమైన పార్టీకి వేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. అందుకు కొన్నిచోట్ల అధికార యంత్రాంగమూ సహకరించినట్లు సామాజిక మాధ్యమాల్లో వార్తలు వచ్చాయి. బ్యాలెట్ పత్రాలను ఉపయోగించిన సమయంలో ఆ పెట్టెలో సిరా పోసి, ఓట్లు చెల్లనివిగా మార్చే ప్రయత్నాలు చేసినట్లే- ప్రస్తుతం ఈవీఎంలను పగులగొడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈవీఎంల చుట్టూ ముసురుకుంటున్న అనుమానాలను తొలగించేందుకు ఎన్నికల సంఘం తక్షణం చొరవ చూపాలి. విధానపరమైన అంశాలకు సంబంధించి మేలైన సంస్కరణలు తీసుకువస్తే- ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1400 మంది ఓటర్లు ఉన్నప్పటికీ- నిర్దేశిత 11 గంటల (ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు) సమయంలో పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసేందుకు ఇబ్బందులు ఉండవు. అందుబాటులోని సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా ఉపయోగించుకునేందుకు ఎన్నికల సంఘం ఏ దశలోనూ ప్రయత్నించకపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. రాజకీయపరమైన ఆరోపణలు పక్కన పెడితే- సాంకేతిక, విధానపరమైన అంశాలపై భారత ఎన్నికల సంఘం తన నిబద్ధతను చాటుకొని విశ్వసనీయతను కాపాడుకోవాల్సిన తరుణమిదే!

- ఎం. కృష్ణారావ్

*(కర్టెసీ: ఈనాడు, సాక్షి, ఆంధ్రజ్యోతి, నమస్తే తెలంగాణ, నవ తెలంగాణ, సోషల్ మీడియా)* ❍

# 'జనరేషన్ జెడ్'కీ లోక్‌సత్తాను కనెక్ట్ చేయాలి

- **అన్నపూర్ణ. ఎ,** కెలిఫోర్నియా



**"రా**జకీయాల్లోకి కొత్త నాయకులు ఎందుకు రావడం లేదు? కారణం ప్రజలా, పార్టీలా, భ్రష్టుపట్టిన రాజకీయాలా?" అని ఆలోచిస్తే సమాధానం కూడా ప్రశ్నలోనే ఇమిడి ఉందనిపించింది. కొత్తగా వచ్చిన పార్టీలలో లోక్‌సత్తా (రాజకీయాలలో 14 ఏళ్లు తక్కువ సమయమే. లోక్‌సత్తా ఉద్యమం 1997లో ప్రారంభం కాగా, ఆ తర్వాత సుమారు పదేళ్లకు లోక్‌సత్తా పార్టీ ఆవిర్భవించింది) ఈ 2019 ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ఎందులోనూ "మెర్జ్" కాలేదు. కనీవినీ ఎరుగనిరీతిలో తెలుగు రాష్ట్రాల్లో నల్లడబ్బు చుట్టూ జరిగిన ఈ ఎన్నికల్లో ప్రభావం చూపటం కష్టమని, పోటీ చేయండని ప్రోత్సహిస్తే నిజాయతీగా డబ్బు సంపాదించిన సామాన్య, మధ్యతరగతి అభ్యర్థులు క్రష్ అయిపోయే ప్రమాదముందని గుర్తించి ఈ ఎన్నికలకు లోక్‌సత్తా దూరంగా ఉంది. నోటుకు, తాయిలాలకు, భావోద్రేకాలకు తావు లేకుండా ఎజెండా చుట్టూ ఎన్నికల్ని తిప్పటానికి ఏ ప్రధాన పార్టీ కూడా తాజా ఎన్నికల్లో ప్రయత్నం చేయలేకపోయింది. చివరికి మార్పు కోసం వచ్చామన్న జనసేన పార్టీ కూడా.

ఆంధ్రప్రదేశ్‌లో తెదేపా, వైకాపాలతో పోలిస్తే జనసేన సామాన్య యువతకు ఎక్కువగా టికెట్లనిచ్చిందిగానీ, ఎజెండా విషయంలో ఏమాత్రం ముందడుగు వేయలేకపోయింది. ఈ ఎన్నికల్లో జనసేనకు ఓటు వేసినవారు ఆ తర్వాత ఎన్నికల్లో తెదేపా, వైకాపాలాంటి సాంప్రదాయ పార్టీల వైపునకు మళ్లటం తేలిక. వారు కేవలం కొత్తదనం, వ్యక్తిగత ఆకర్షణ పట్ల ఉద్వేగంతో ఓటు వేశారు. ప్రత్యేకించి ప్రజల్లో, ముఖ్యంగా యువతలో జనసేన 'ఉమ్మడి, దీర్ఘకాల అవసరాల' చుట్టూ వేసిన భావజాల ముద్రంటూ ఏమీ లేదు. కానీ లోక్‌సత్తా విషయం భిన్నమైనది. లోక్‌సత్తా పోటీలో లేకున్నా ఒక ఎజెండాను ముద్ర వేసింది. ప్రజలకు సుదీర్ఘకాలం ఉపయోగపడే ఎజెండా అది. ఆ ఎజెండా విషయంలో మిగతా పార్టీలను ప్రజలు లోక్‌సత్తాతో పోల్చిచూడరు. ఒకవేళ లోక్‌సత్తా ఎజెండాను మిగతాపార్టీలు యథాతథంగా కాపీ చేసి అమలు చేస్తే, అది కూడా లోక్‌సత్తా తన విజయంగానే భావించి ప్రోత్సహిస్తుంది. అటువంటి ప్రభావాన్ని, దీర్ఘకాలిక ప్రజాప్రయోజనాన్ని జనసేన ఈ ఎన్నికల్లో ముద్ర వేయలేకపోయింది. అంతెందుకు, ఎన్నికల ముందు వరకు తీవ్ర చర్చనీయాంశంగా ఉన్న ప్రత్యేకహోదా, రెవెన్యూలోటు భర్తీ, ఇతర విభజన హామీల అమలు వంటివేమీ కూడా ఎన్నికల ప్రచార సమయంలో చర్చకు రాలేదు వీటిని బరిలోకి లాగటంలో సైతం జనసేన విఫలమైంది. చర్చంతా కేసీఆర్, మోదీ, జగన్, చంద్రబాబు, పవన్ చుట్టూనే పరిభ్రమించింది. ఎన్నికల సంఘం పనితీరు, వ్యక్తిగత దూషణలే పెద్దఎత్తున ప్రచారమయ్యాయి.

కొందరు మిత్రులు అన్నట్లు, జేపీ, జేడీ, జనసేన కలిసి ఎన్నికలకు వెళ్లి ఉంటే కచ్చితంగా 2019 సార్వత్రిక ఎన్నికల్లో పెద్ద గుణాత్మక మలుపువచ్చేది. ఆ కాంబినేషన్‌కి కచ్చితంగా 15-20 శాతం ఓట్లు లభించేవి. అధికారంలోకి రాకపోయినా, పెనుప్రభావాన్ని చూపేవారు. అన్నిటికన్నా ముఖ్యంగా, ఆంధ్రప్రదేశ్ సుస్థిర, సమగ్రాభివృద్ధికి, సమున్నత భవిష్యత్తుకు అవసరమైన విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, పటిష్ట అవినీతి నిర్మూలన చట్టం, విభజన హామీల అమలుకు రోడ్ మ్యాప్ తదితర అంశాల ఎజెండాను జేపీ కచ్చితంగా ప్రధాన స్రవంతిలోకి తెచ్చి ఉండేవారు. ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీల అమలుపై లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ చొరవతో స్వతంత్ర నిపుణుల కమిటీ (ఐజేఐ) రూపొందించిన నివేదికను మరింతగా చర్చనీయాంశం చేస్తూ వాస్తవాల్ని, ఫెడరలిజం ఆవశ్యకతను ప్రజల్లోకి ఇంకా విస్తృతంగా తీసుకెళ్లగలిగేవారు. జెండాలు, నేతల చుట్టూ కాకుండా ఎజెండా చుట్టూ ప్రజలను సమీకరించగలిగి ఉండేవారు. అప్పుడు ఇష్టంలేకపోయినా ప్రధాన పార్టీలు కూడా మాట్లాడాల్సి వచ్చేది.

ఈ ఎన్నికల్లో పోటీ చేయకపోయినా ఒక రాజకీయ ఉద్యమంగా లోక్‌సత్తా తన పని తాను చేసుకుపోతోంది. ప్రజల జీవితాల్లో మౌలిక మార్పు తెచ్చే సంస్కరణల

అమలుకు జేపీ తన వంతు ప్రయత్నాన్ని ప్రధాన రాజకీయ పార్టీల కంటే కూడా ఎక్కువగా చేస్తున్నారు. ఎన్నికల్లో అధికారం అనే సాధనం కూడా సమకూరితే ఈ మార్పుల్ని ఇంకా వేగంగా సాధించవచ్చు కాబట్టి.. స్థానిక ఎన్నికలతో మొదలుపెట్టి అంచెలవారీగా మళ్లీ ఎన్నికల్లో పోటీకి ప్రణాళికాబద్ధంగా ప్రయత్నిద్దాం.

ఇప్పటికైతే మన శక్తి మేరకు అంతఃకరణ శుద్ధితో లోక్‌సత్తా ఉద్యమసంస్థ వేదికగా లక్ష్యాల కోసం పనిచేద్దాం. ఇదే మాట వ్యక్తిగతంగా టచ్‌లో ఉండే మిత్రులతో కూడా చెబుతుంటాను. ఉద్యమ సంస్థలో పరిజ్ఞానం సంపాదించుకున్నవారు ఎన్నికల్లో లోక్‌సత్తా పార్టీకి వెలుపల పోటీ చేయకూడదనేమీ లేదు. ముఖ్యంగా యువత లోక్‌సత్తా ఉద్యమసంస్థలో ఒక స్థాయిని సంతరించుకున్నాక, అవసరాన్ని బట్టి ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించవచ్చు. మేధావులు, అనుభవజ్ఞులు, దిశా నిర్దేశకులూ ఉద్యమ సంస్థకు పోషకులైతే, యువత ఉద్యమం, ఎన్నికలు రెంటిలో పాలువంచుకోవచ్చు. రాబోయే కాలమంతా యువతదే. వారికి విజయ సోపానాలను నిర్మించి ఇవ్వటం లోక్‌సత్తా ఉద్యమ సంస్థలో సీనియర్లుగా మన బాధ్యత. సంస్థను కాపాడుకోవటం మన కర్తవ్యం. జనబలం, యువబలం, మనోబలం, ఆర్థికబలం అన్నీ ఉన్నప్పుడే మనం ఏదైనా చేయగలం. మంచి పనికి తోడ్పాటు అందించాలనుకునేవారు నెలకి వంద రూపాయలు అయినా ఇవ్వొచ్చు. సంవత్సరానికి వేయి రూపాయలు చందా కట్టి ప్రచురణల్ని కొనుక్కోవచ్చు. అడ్వర్టయిజ్‌మెంట్లు ఇవ్వొచ్చు, ఇప్పించవచ్చు. మనం వ్యక్తిగతంగా చేయాలన్నా చేయలేనివి జేపీ నేతృత్వంలోని ఉద్యమ సంస్థ చేస్తుంది. అందులో మనం భాగం పంచుకుని మన వంతు బాధ్యతను నెరవేర్చటం గర్వకారణం కాదంటారా? సంస్థ ద్వారా సేవ చేయగల అవకాశాన్ని తప్పకుండా ఉపయోగించుకుందాం. కలిసి వస్తారని ఆశిస్తున్నాను.

ఇక్కడ ఇంకో విషయం లోక్‌సత్తా సహచరులు, అభిమానులతో పంచుకోవాలనుకుంటున్నాను. పార్టీల కార్యకలాపాలు, నాయకుల నోటి దురుసుతనంపై ఆవేదనను, అసంతృప్తిని వ్యక్తం చేస్తూ గత రెండు నెలలుగా కొన్ని వ్యాసాల్ని రాశాను. కానీ ఆ వ్యాసాలు పూర్తి చేశాక.. ఎవరి ప్రసంగాల్ని విన్నా, ఏ చర్చా కార్యక్రమాన్ని చూసినా అదే పరిస్థితి కనిపించింది. దీంతో.. మనం ఒకర్నో, నలుగురినో విమర్శించి ప్రయోజనం లేదు, అందరి తీరూ ఒకేలా ఉన్నప్పుడు అసలు పునాదుల్నే ప్రక్షాళన చేయాలని బోధపడింది. ఆ వ్యాసాల్ని చించేసి, ఆ భావాల్ని మనసులో నుంచి చెరిపేశాను. లోక్‌సత్తా లక్ష్యం రెండు దశాబ్దాలలో కొన్ని కోణాల్లో మరింత సంక్లిష్టమయిందే అన్న బాధను దిగమింగుకుని వార్తల్ని పరిశీలిస్తున్నప్పుడు, టీడీపీ అనంతపురం నాయకుడు జేసీ దివాకర్‌రెడ్డి వ్యాఖ్యలు కనిపించాయి. వినోదమూ, ఆనందమూ, మెచ్చుకోలూ కలగలిసిన భావం కలిగింది. అధికార తెలుగుదేశం పార్టీ గత ఐదేళ్లలో ఏం చేసింది అనే దాని కంటే, ఎన్నికలకు రెండు రోజుల ముందు ప్రభుత్వం అమలు చేసిన పసుపు కుంకుమ, అన్నదాతా సుఖీభవ, వృద్ధాప్య పింఛను పెంపు కార్యక్రమాలే పార్టీని గెలిపిస్తాయి అని ఆయన ప్రకటించారు. ఒక్కో ప్రధాన పార్టీ ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 25 నుంచి 50 కోట్ల రూపాయల వరకు ఖర్చు చేశాయని కుండబద్దలు కొట్టారు. ఓటుకు నోటు 20 ఏళ్ల కిందట మొదలై ఇప్పుడు పరాకాష్ఠకు చేరిందన్నారు. తాజా ఎన్నికల్లో ఓటుకు రూ.2,000 నోటు నుంచి రూ.5,000 వరకు పలికిందన్నారు. పలుచోట్ల ఓటర్లు డిమాండ్ చేసి మరీ డబ్బు తీసుకున్నారన్నారు. ఇంత డబ్బును పంచిన పార్టీల్లో ఎవరు అధికారంలో కొచ్చినా ఊరుకుంటాయా? మొదటి రోజు నుంచీ పంచిన డబ్బును వసులు చేసుకోవటం మొదలుపెడతాయి. మళ్లీ ఎన్నికల వరకూ ఐదేళ్ల పాటు ఈ దోపిడీ యధేచ్ఛగా కొనసాగుతుంది. అందుకే డబ్బే సర్వస్వంగా మారి ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెట్టిన ఎన్నికల వ్యవస్థలో సంస్కరణల కోసం జస్టిస్ చలమేశ్వర్, జయప్రకాష్ నారాయణ్, వీవీ లక్ష్మీనారాయణ, ఇంకా కొందరు ప్రజాసేవాభావం గల వారితో చర్చించి పోరాటం ప్రారంభిస్తానని చెప్పుకొచ్చారు. ఓటుకు నోటు పంచని ఎన్నికల కోసం కృషి చేస్తానన్నారు. తాను రాజకీయాల నుంచి రిటైరవుతున్నట్లు జేసీ దివాకర్ గారు చెప్పినట్లు గుర్తు. వారి అబ్బాయిని తన వారసుడిగా ఆయన ప్రమోట్ చేసుకుంటున్నారు. వంశపారంపర్య రాజకీయాలను చేస్తున్నా, రిటైరయ్యాకైనా పాపప్రక్షాళన కోసం ఏదోకరీతిలో వ్యవస్థను మార్చాలని ఆయన చేస్తున్న ప్రయత్నాన్ని స్వాగతించాల్సిందే. దిమాగ్, దేశం పట్ల ప్రేమ ఉంటే ఎన్నికల సంఘం కూడా దివాకర్‌రెడ్డి లాంటి వారి కన్ఫెషన్లపై చట్టపరమైన చర్యల కన్నా సమస్య పరిష్కారంపై చర్చకు చొరవ చూపాలి. పరిస్థితి అంత తీవ్రంగా ఉంది మరి! మార్పును ఆహ్వానించడంలో లోక్‌సత్తా ఎప్పుడూ ముందే ఉంటుంది. వ్యక్తుల్ని, ఉద్దేశాల్ని బట్టి కాకుండా.. పర్యవసానాల్ని బట్టి స్పందిస్తుంది. దివాకర్ రెడ్డి గారు సంస్కరణల కోసం ప్రయత్నిస్తే, ఆయన ఉద్దేశాలు ఏవైనా, ప్రజలకు మాత్రం మేలుజరుగుతుంది. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ లోక్‌సత్తా ఎప్పటి నుంచో చెబుతున్న

'హక్కుగా పౌర సేవల' చట్టాన్ని ఏదోకరూపంలో తెస్తానని చెబుతున్నారు. లోక్‌సత్తా భావజాలానికి సానుకూలంగా మారుతున్న ప్రధాన స్రవంతి రాజకీయాలను ఎక్కడికక్కడ అందిపుచ్చుకుని సరైన దిశలో పరిష్కారం దాకా నడిపించాలంటే.. మనం నిరంతరం అప్రమత్తతతో విస్తరిస్తూ ఉండాల్సిందే.

తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడికెళ్లినా లోక్‌సత్తా వాళ్లు తగులుతారు. కొత్త రాజకీయానికి లోక్‌సత్తాకొచ్చిన స్పందన తెలుగునాట ఆ నినాదంతో సినిమా గ్లామర్‌తో వచ్చిన జనసేన సహా ఏ పార్టీకీ, సంస్థకు రాలేదు. అయితే లోక్‌సత్తా ఆవిర్భవించాక పుట్టిన మిలీనియల్స్, జనరేషన్ జెడ్ కొత్త తరానికి లోక్‌సత్తా చేరువ కావాల్సి ఉంది. ఇది దానంతట అది జరగదు. పరిజ్ఞానం, రాజకీయ సంస్కృతిల ట్రాన్స్‌ఫర్‌కి మనమంతా పనిగట్టుకుని ప్రయత్నం చేయాలి. 2000 సంవత్సరం నుంచే మనం ఈ కోణాన్ని గుర్తించి పనిచేయాల్సింది. ఈ మధ్య ఎవరో అన్నారు.. జేపీగారికి అరవయ్యేళ్లు దాటాయి కాబట్టి, గతంలోలా యూత్‌కి కనెక్ట్ కావటం కొంత కష్టం అని. అయ్యలారా, అమ్మలారా! జేపీ కంటే వయసులో పెద్దవాడైన నరేంద్ర మోదీకి యువత ఎగబడుతుండగా లేనిది, జేపీకి కనెక్ట్ కాకపోవటమేమిటి? ఇప్పుడున్న యువత కంటే చాలా యంగ్‌గా జేపీ ఆలోచిస్తారు. సురాజ్య యాత్రలో ఆయన సమావేశాలకు జనరేషన్ జెడ్ అద్భుతంగా స్పందించారు. వేలసంఖ్యలో ఎన్‌రోల్‌మెంట్‌కి, ఆయనతో కలిసి పనిచేయటానికి ముందుకొచ్చారు. అన్నిటికంటే ముఖ్యంగా, లోక్‌సత్తా భావజాలం సతతహరితం, అజరామరం! కొత్తతరానికి కొత్త రాజకీయం.. అన్న లోక్‌సత్తా ట్యాగ్‌లైన్ ప్రతి తరానికీ వరిస్తుంది. యూత్‌కి కనెక్ట్ చేయాల్సిన బాధ్యత జేపీ ఒక్కరిదేనా? మనందరికీ లేదా? ఇప్పటికైనా మించిపోయిందేమీ లేదు. వచ్చే ఆగస్టు నెలలో సంస్థ పుట్టినరోజుకి అందరమూ కలుస్తామని ఆశిస్తున్నాను. తాజా కొత్తతరంతో లోక్‌సత్తాను బలోపేతం చేస్తూ భవిష్యత్ రాజకీయ ఉద్యమ కార్యాచరణను ప్రారంభించటానికి ఈ సమావేశం వేదిక కావాలి. ఇందుకు సిద్ధమవ్వాలని మిత్రులందరికీ వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాను. ❍

# హక్కుగా 'పౌర సేవల' చట్టం తేవాలి


**మం**చిర్యాల రైతు ఫేస్‌బుక్‌లో పెట్టిన పోస్టింగ్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించటాన్ని, రెవెన్యూ శాఖ సేవలను అవినీతిలేని టైటిల్ గ్యారంటీ దిశగా ప్రక్షాళన చేయాలన్న ప్రకటనను హర్షిస్తున్నామని.. అయితే అవినీతి ఒక ఊరికో, ఒక ప్రభుత్వ విభాగానికో పరిమితం కాదని, సర్వాంతరయామిలా రోజువారీ జీవితాల్లో ప్రజల్ని పీల్చుకుతింటోందని లోక్‌సత్తా ఉద్యమసంస్థ కరీంనగర్ జిల్లా బాధ్యులు ఎన్. శ్రీనివాస్, ప్రకాష్ హోల్లా అన్నారు. అవినీతిని నిర్మూలించి ప్రజలకు నాణ్యమైన సేవలని అందించాలని ముఖ్యమంత్రి నిజంగా భావిస్తే, 'హక్కుగా పౌర సేవల' (సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో తక్షణం అమల్లోకి తేవాలని, లోకాయుక్తను పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. పౌర సేవల చట్టాన్ని తెస్తానని కేసీఆర్ మీడియాలో ప్రకటించగా, ఆ చట్టం ముసాయిదా ప్రతిని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ 2016, అక్టోబర్ 19న తెలంగాణ ప్రభుత్వానికి పంపారని గుర్తు చేశారు. తర్వాత ఆ పనిని నల్సార్ వర్సిటీకి కేసీఆర్ ప్రభుత్వం అప్పగించిందని, నల్సార్ వారికి కూడా లోక్‌సత్తా బిల్లును జేపీ పంపారని తెలిపారు. ఇప్పటికి మూడేళ్లు గడిచినా అతీగతీ లేదన్నారు. లోక్‌సత్తా రూపొందించిన బిల్లు.. కొన్ని రాష్ట్రాల్లో అమలవుతున్న పౌర సేవల చట్టాలకన్నా మెరుగైనదని తెలిపారు (1998లో లోక్‌సత్తా పౌర సేవల పత్రాల కోసం కృషిని ప్రారంభించింది. 2009 నుంచి కొన్ని రాష్ట్రాల్లో ఈ చట్టం అమలు ప్రారంభమైంది. 2012లో కేంద్ర ప్రభుత్వం లోక్‌సత్తా రూపొందించిన బిల్లును ఆమోదించినా, పార్లమెంటు కాలపరిమితి ముగియటంతో పక్కన పెట్టారు). ఈ పౌర సేవల చట్టం ద్వారా ప్రతి ప్రభుత్వ కార్యాలయం ముందు సేవల జాబితాతో, ఒక్కో పనిని ఎన్ని రోజుల్లోగా పూర్తిచేయాలో నిర్దేశిస్తూ బోర్డులు ఏర్పాటు చేయటం జరుగుతుందని, అలా సిటిజన్ చార్టర్‌లో చెప్పిన గడువులోగా పని పూర్తి చేయకపోతే దరఖాస్తు చేసుకున్న ప్రజలకు రోజుకు రూ.250లకు తగ్గకుండా పరిహారం చెల్లిస్తారని వారు వివరించారు. ఈ చట్టాన్ని అమలు చేస్తే తెలంగాణ సుపరిపాలన ప్రస్థానంలో మైలురాయి అవుతుందన్నారు.

**"బానిసత్వం జాతికి వారసత్వం**

**కాకుండా చూసుకోవాలి"**

**- గాంధీజీ**






# 'ప్రజాస్వామ్య పరిణామ క్రమం'... గ్రేట్ బ్రిటన్‌కు దొరికిన వెసులుబాటు మనకు లభిస్తుందా?

మన దేశ పార్లమెంటరీ ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థకు మాతృక అయిన గ్రేట్ బ్రిటన్‌లో ప్రజాస్వామ్యం 8వ శతాబ్దంలో అరకొర పార్లమెంటు నుంచి 1928లో లింగ, మత, జాతి, హోదా వివక్ష లేకుండా వయోజనులందరికీ ఓటు హక్కును అందించేదాకా.. ఎలా ఎదిగిందో తెలియజెప్పే చిత్రమిది! ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) తాజా న్యూస్‌లెటర్‌లో దీనికి సంబంధించిన కథనాన్ని ప్రచురించారు (www.fdrindia.org). బ్రిటన్‌లో ప్రజాస్వామ్యం ఆధునిక దశకు చేరుకోవడానికి ఎన్నో శతాబ్దాలు పట్టిన మాట వాస్తవమే అయినా... మనదేశం కూడా పరివర్తనకు అంత సమయాన్ని తీసుకుంటానంటే పరిస్థితులు అంగీకరించవు. పోటీ ప్రపంచం మనకు అంత అవకాశాన్నివ్వదు. ఇతర దేశాల అత్యుత్తమ విధానాల నుంచి, మన అనుభవాల నుంచి పాఠాల్ని నేర్చుకుంటూ ఎప్పటికప్పుడు ఆచరణాత్మకంగా, వేగంగా రాజ్యాంగ ప్రజాస్వామ్య వ్యవస్థలను నిర్మించు కోగలిగితేనే భారత్ తనకున్న శక్తిసామర్థ్యాలు, మన ఆకాంక్షలకనుగుణంగా ఉన్నతస్థాయికి ఎదగగలుగుతుంది.

Posting Date 22-05-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on May 16th, 2019

# స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం ప్రజాఉద్యమం





ఎవరెన్ని గంభీర ఉపన్యాసాలిస్తున్నా, ప్రచార ఆర్భాటాలు చేస్తున్నా... మన ప్రజాస్వామ్యం తీవ్ర సంక్షోభంలో ఉన్నమాట వాస్తవమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాశ్ నారాయణ్ అన్నారు. సరైన నాయకులు లేకపోవటం , ఎన్నికల్లో డబ్బు ప్రభావం విపరీతం కావడమే ఇందుకు ప్రధాన కారణాలన్నారు. దీనికి పరిష్కారం స్థానిక ప్రభుత్వాలైన పంచాయతీలు, మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు సాధికారత కల్పించటం నుంచే మొదలవ్వాలన్నారు. 1) సర్పంచ్‌లు, ఛైర్మన్లు, మేయర్లు సహా అన్ని స్థాయిల్లో స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికల్ని నిర్వహించటం 2) వాటికి నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయటం 3) చిన్న పంచాయతీలుగా కాకుండా 20,000-30,000 జనాభాతో కొన్ని పంచాయతీల సముదాయాన్ని ఒక యూనిట్‌గా తీసుకుని ఎన్నికల్ని నిర్వహించటం ద్వారా గొప్ప నాయకుల్ని తయారుచేయవచ్చని, ప్రజలకు రోజువారీ సమస్యలు లేని మంచి పాలనను అందించవచ్చని జేపీ అన్నారు. సమాజానికి ఏదో సేవ చేయాలనే తపన ఉన్న యువతీయువకులు అనేకమంది ఉన్నారన్నారు. అయితే, ఇప్పుడున్న కేంద్రీకృత, డబ్బు రాజకీయాల్లో ఏం చేయాలో వారికి అర్థం కావటం లేదన్నారు. బలమైన స్థానిక ప్రభుత్వాలు వారికి సరైన కార్యక్షేత్రాలవుతాయని అన్నారు. నెహ్రూ, చిత్తరంజన్‌దాస్., సర్దార్ వల్లభాయ్ పటేల్ లాంటి మహానాయకులు స్థానిక ప్రభుత్వాల నుంచే జాతీయ స్థాయికి ఎదిగారన్నారు. దేశ సమైక్యత, సుపరిపాలన, అవినీతి నిర్మూలన, యువ నాయకుల తయారీ... ఈ మొత్తానికీ స్థానిక ప్రభుత్వాల సాధికారత చుట్టూ పకడ్బందీ వ్యూహ రచన చేయాలన్నారు. ఇందుకోసం తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖులతో కలిసి ఓ పెద్ద ప్రజాఉద్యమాన్ని ప్రారంభిద్దామన్నారు. ప్రజాస్వామ్యాన్ని గాడిలో పెట్టేందుకు చేస్తున్న ఈ ప్రయత్నంలో అందరూ పార్టీలకతీతంగా భాగస్వాములు కావాలన్నారు. 'స్థానిక ప్రభుత్వాల ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో జరగాలి' అంశంపై లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అధ్యక్షతన విశాఖపట్నం ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో జేపీ మాట్లాడారు. మాజీ మంత్రులు కొణతాల రామకృష్ణ, రెడ్డి సత్యనారాయణ, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, రాష్ట్ర పంచాయితీరాజ్ ఛాంబర్ నేతలు రోశిరెడ్డి , మామిడి అప్పలనాయుడు, బీజేపీ నేత నాగేంద్ర, సీపీఐ పైడిరాజు, చలసాని గాంధీ, మాజీ ఎంపీపీ చినరామునాయుడు. వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, జేఎస్పీ, కాంగ్రెస్ తదితర పార్టీల, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు పాల్గొని ఆలోచనల్ని పంచుకున్నారు. (పూర్తి వివరాలు లోక్‌సత్తా టైమ్స్ వచ్చే సంచికలో)

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad